# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 21-8-2022 RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 17 పేజీలు:6 వెల: రూ.1/-


## హోటల్ పై ఉగ్రవాదుల దాడి-ఎనిమిది మంది మృతి

న్యూఢిల్లీ, ఆగష్టు 20: ఓ హోటల్ పై అటాక్ చేశారు అల్ షబాబ్ ఉగ్రవాదులు.. ఈ సంఘటన సొమాలియాలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. రాజధాని మొగధీషులో ఈ ఘటన జరిగినట్లు భద్రతా అధికారులు తెలిపారు. హోటల్‌లోకి ప్రవేశించిన ఉగ్రవాదులు అక్కడ కొంత మందిని బంధీ చేశారు. అయితే భద్రతా దళాలు ఆ హోటల్‌లోకి ప్రవేశించి ఉగ్రవాదుల్ని నేలకూల్చారు. మొగధీషులోని హోటల్ హయ్యత్ వద్ద రెండు కారు బాంబు పేలుళ్ల ఘటనలు జరిగాయి. ఆ దాడులకు కూడా అల్ షబాబ్ కారణమని తెలుస్తోంది.

## సీజేఐ ఎన్వీ రమణకు గౌరవ డాక్టరేట్ ప్రదానం



హైదరాబాద్, ఆగష్టు 20: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఎన్వీ రమణకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 37, 38 స్నాతకోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ స్నాతకోత్సవం కార్యక్రమంలో వర్సిటీ ఛాన్సలర్ హోదాలో గవర్నర్ బిశ్వభూషణ్, వైస్ చాన్సలర్ రాజశేఖర్‌తో పాటు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీజేఐ ఎన్వీ రమణ మాట్లాడుతూ? ఈ విశ్వవిద్యాలయంలో చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు. తాను చదువుకున్న యూనివర్సిటీ నుంచే గౌరవ డాక్టరేట్ పొందడం అనిర్వచనీయమైన అనుభూతిని పొందుతున్నానన్నారు. ఇక్కడి క్యాంటీన్ తమ అడ్డా అని, ఇక్కడ కూర్చుని ఎన్నో విషయాలపై చర్చించేవారమన్నారు. అలాంటి చర్చలు ఇప్పుడు జరగడం లేదని విచారం వ్యక్తం చేశారు. సమస్యలపై యువత స్పందించాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా తయారుకావాలని సూచించారు. గత 40 ఏండ్లుగా నాగార్జున విశ్వవిద్యాలయం విద్యా రంగానికి అందిస్తున్న సేవలు అమోఘమైనవని ప్రశంసించారు. హోలిస్టిక్ విద్యా విధానం అమలవుతేనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.

## భారీ వర్షాలకు కూలిన చక్కి రైల్వే బ్రిడ్జ్.. హిమాచల్ ప్రదేశ్‌లో 14 మంది మృతి

షిమ్లా, ఆగష్టు 20: హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కంగ్రా జిల్లాలో ఉన్న చక్కి రైల్వే బ్రిడ్జ్ ఇవాళ కూలింది. శనివారం ఆ బ్రిడ్జ్ కూలినట్లు జిల్లా మెజిస్ట్రేట్ రోహిత్ రాథోడ్ తెలిపారు. మండి జిల్లాలో కూడా ఇవాళ ఉదయం అకస్మాత్తుగా భారీ వర్షం, వరద వచ్చింది. అయితే కొండచరియలు విరిగిపడిన ఘటనలో 14 మంది మృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు. చంబా జిల్లాలో వర్షాల వల్ల కొండచరియలు విరిగి ఓ ఇంటిపై పడ్డాయి. ఆ ఘటనలో ముగ్గురు మరణించారు.

మండి జిల్లాలోని బాగీ నుల్లాలో ఓ అమ్మాయి మృతదేహన్ని ఇంటికి అరకిలోమీటరు దూరంలో గుర్తించారు. ఆ అమ్మాయి కుటుంబానికి చెందిన అయిదుగురు వరదల్లో కొట్టుకుపోయినట్లు డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ అధికారులు తెలిపారు. క్లౌడ్‌బస్ట్ కావడంతో బాగీ నుంచి ఓల్డ్ కటోలా ప్రాంతంలో ఉన్న ఇండ్లకు చెందిన కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడడం వల్ల మండి జిల్లాలో రోడ్లన్నీ బ్లాక్ అయ్యాయి.

## మునుగోడులో టీఆర్ఎస్ గెలుపు తథ్యం: మంత్రి తలసాని

హైదరాబాద్, ఆగష్టు 20: మునుగోడులో టీఆర్ఎస్ ప్రజా దీవెన సభకు మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పెద్దఎత్తున తరలి వెళ్తున్నారు. నగరం నుంచి మునుగోడుకు వెళ్తున్న భారీ కాన్వాయ్‌కి నెక్లెస్ రోడ్ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమన్నారు. మునుగోడులో విజయం టీఆర్ఎస్ పార్టీదేనని స్పష్టం చేశారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని చెప్పారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చేతకాని తనం వల్లే ఉప ఎన్నిక వచ్చిందని విమర్శించారు.

కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌ను టీఆర్ఎస్‌లో చేరాలని ఆహ్వానించానని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలంటే సీనియర్లంతా టీఆర్ఎస్‌లో చేరాలని పిలుపునిచ్చారు.

ఖైరతాబాద్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల నుంచి మూడు వందల చొప్పున కార్లలో టీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు మునుగోడుకు బయల్దేరారు. మొత్తంగా ఐదు వేలకుపైగా కార్లతో హైదరాబాద్ నుంచి మునుగోడుకు భారీ ర్యాలీ జరుగనుంది.

### చరిత్రలో నేటినిజం



(ఆగష్టు 21 నటి భూమికా చావ్లా జననం..)

-రాధశ్రీ



సెల్:9494481210

## ఫ్లోరైడ్ రహిత మునుగోడుగా మనం మార్చుకున్నాం-సీఎం కేసీఆర్



హైదరాబాద్, ఆగష్టు 20: ప్రజల చేతుల్లో ఉండే ఒకే ఒక ఆయుధం ఓటని, దాని ద్వార నిర్మాణమయ్యే శక్తి అని, మనకు ఉపయోగపడుతదా? పడదా? ఆలోచించి ఓటు వేయాలని సీఎం కేసీఆర్ అన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు ప్రజాదీవెన సభలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభకు హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 'మునుగోడు నియోజకర్గం ఒకనాడు ఫ్లోరైడ్ నీళ్లతోని నడుములు వంగిపోయి.. ఏవిధంగా బాధపడ్డదో నేను చెప్పాల్సిన అవసరం లేదు. కేసీఆర్‌కన్నా ముందు.. కేసీఆర్ దొడ్డు, ఎత్తు ఉన్నవాళ్లు ఎంతోమంది ముఖ్యమంత్రులు అయ్యారు. ఆనాడు ఇదే జిల్లా బిడ్డ సత్యనారాయణ ఉద్యోగానికి రాజీనామా చేసి జలసాధన పోరాటం చేసి ఆనాడున్న ప్రధానమంత్రి ముందుపడుకోబెట్టి అయ్యా మా బతుకు ఇది అంటే.. ఎవడూ మన మొర వినలే.

ఆ తదనంతరం.. నేనే తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన తర్వాత.. మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పినట్టు రాష్ట్రమంతా మీ బాధ గురించి చెప్పుతూ వచ్చిన. అంశాల స్వామికావచ్చు, ఫ్లోరైడ్ బాధితులు కావొచ్చు.. దేశ, విదేశాల నుంచి వచ్చి చూస్తా ఉంటే వాళ్ల నిరసన తెలిపి, బాధను వ్యక్తం చేశారు. మే ప్రదర్శన వస్తువులమా? మమ్మల్ని అవమాన పరుస్తున్నరు.. రాకండి.. మీకు దమ్ముంటే సమస్య పరిష్కరించండి అని తిట్టి పంపారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా నల్లగొండ నగారా అని పేరుతో పది రోజుల పాటు జిల్లామొత్తం తిరిగి ఫ్లోరైడ్ మీద చైతన్య పరచడం జరిగింది. శివన్నగూడెం గ్రామంలో నిద్రకూడా చేశాను. ఏమయనే నల్లగొండ.. అనే మాట గూడ చెప్పడం జరిగింది.

అనేక ప్రభుత్వ, అనేక పార్టీలు, అనేక రాజకీయాల తర్వాత మనందరి పోరాటాల ఫలితంగా.. మన తెలంగాణకు వస్తే.. ఇవాళ జీరో ఫ్లోరైడ్.. ఫ్లోరైడ్ రహిత మునుగోడు, నల్లగొండగా మార్చుకున్న మిషన్ భగీరథ పథకంతో. ప్రపంచ ఆరోగ్య సంస్థ నల్లగొండ జిల్లా సరైన ప్రయత్నాలు జరుగపోతే మానవ నివాసయోగ్యం కాకుండా పోతుందని, నోమ్యాన్ జోన్ అవుతుందని, ఇక్కడ మనుషులు నివసించలేరు.. ఇక్కడ శుద్ధి చేసిన నీళు ఇవ్వాలి. ఇక్కడ పండే పంటలు తింటే కూడా ప్రమాదమే అని చెప్పింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పినా.. ఆ నాడు రాష్ట్ర, దేశ పాలకులు పట్టించుకోలేదు. మంచినీళ్లతే కిందపడి మీదపడి తెచ్చుకున్నం.

ఒక బాధ పోయింది. సాగుకు నీళ్లు రావాలి. ఎక్కడి నుంచి రావాలి.. నల్గొండ జిల్లా ఉండేది కృష్ణ బేసిన్‌లో.. శివన్నగూడెం ప్రాజెక్టు రావాలి.. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తీసుకొని లిఫ్ట్ ద్వారా నింపుకోవాలి. దాని ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నం. ఎన్నికలు రాంగనే ఆగమాగం కావొద్దు.. మన చేతుల్లో ఉన్న అధికార్ని ఎవరికో అప్పచెప్పి ఎవరో.. పోరాటం చేయమంటే చేయరు. ప్రజల చేతుల్లో ఉండే ఒకేఒక ఆయుధం ఓటు. దాని ద్వార నిర్మాణమయ్యే శక్తి.. మనకు ఉపయోగపడుతదా? పడదా? ఆలోచించి ఓటు వేయాలి.

మన చుట్టూ ఏం జరుగుతుందో చర్చ పెట్టాలి.. ఆ చర్చలో భాగంగానే ఈ రోజు దేశంలో జరిగే వ్యవహారాలు, ప్రజావ్యతిరేక వ్యవహారాలకు, సమాజాన్ని చీల్చిచెండాడే విద్వేష విధానాలకు వ్యతిరేకంగా పోరాటం జరుగాల్సి ఉందని జాతీయ, రాష్ట్రస్థాయి కమ్యూనిస్ట్ నాయకులు, ఇతర పార్టీల నేతలతో చర్చలు జరుపుతున్న. గత ఐదారు మాసాలు తలకాయ అంతా పలగొట్టుకుంటున్నమ్. ఈ దేశాన్ని ఎలా కాపాడుకోవాలని ఆలోచన చేస్తున్నం. అందులో భాగంగా ఎక్కడ విధంగా ఏరాపేరి గోల్‌మాల్ ఉప ఎన్నిక వచ్చిందో తెలుసు. ఏ అక్కర ఉండి వచ్చింది ఇక్కడ ఉప ఎన్నిక' అని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు.

బీజేపీకే మీటర్ పెట్టాలే..! ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్..

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే.. రైతు, ప్రజావ్యతిరేక విధానాలే ప్రధాని మోదీకి శత్రువు సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. మునుగోడు ప్రజా ఆశీర్వాద సభలో కేంద్రంలోని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న వైఖరిపై ధ్వజమెత్తారు. వ్యవసాయ కరెంటు మోటార్లకు కేంద్రం ఎందుకు మీటర్లు పెట్టమంటున్నదో చెప్పాలని డిమాండ్ చేశారు. కారణాలు ఏంటో చెప్పాలని నిలదీశారు. 'ఎదుకు పెట్టమంటున్నవ్ మీటర్.. ఏం కారణం.. నిన్ను మేం అడుగుతలేమే.. నిన్ను బతిమిలాడినమా పైసలు ఇవ్వమని. ఇదే నల్లగొండ జిల్లా, పాలమూరు, అనేక ఇతర జిల్లాల్లో పది, ఇరవై ఎకరాలు ఉన్నవాళ్ల హైదరాబాద్‌కు వచ్చి ఆటోలు నడిపారు. ఆ రోజు ఏడ్చాం.. బాధపడ్డాం.. మా ప్రాజెక్టులు కాలే.. మాకు నీళ్లు రాలే.. కరెంటు రాదు.. చెట్టుకొకరు గుట్టకొకరు అయ్యారు రైతాంగమంతా.. ఇవాళ ఏ ప్రయత్నమన్న చేసే మళ్లీ గ్రామాలు పచ్చబడాలే.. రైతులు బాగుపడాలే.. గ్రామం సల్లగుంటే.. రైతు వద్ద నాలుగు పైసలు ఉంటే.. రైతు ధాన్యంపండిస్తే బ్రహ్మాండంగా ఉంటుందని తిప్పలు పడుతున్నం. రైతుబంధు పెట్టుకున్నం. నీళ్లు ఇచ్చుకుంటున్నం. మిషన్ కాకతీయతో చెరువులు బాగు చేసుకున్నం' అన్నారు.

### కండ్లు మండుతున్నయ్..

'ఇవాళ కొద్దికొద్దిగా ఇప్పుడిప్పుడే జరజర తెల్లపడుతున్నమ్.. తెలంగాణకు జరజర తెలివి వస్తున్నది.. కండ్లు మండుతున్నయా? దమ్మంటు నువ్వు ఉన్నకాడ చెయ్. అక్కడ చేసుడు చేతకాదు. మొన్న నేను అడిగినా.. ఢిల్లీలో లేదు కరెంటు.. హైదరాబాద్‌లో ఉంటది.. మేం ఇంతపొదువు, అంతపొదువు చేసినం అంటరు.. దేశ రాజధానిలోనే మంచినీళ్లు దిక్కులేవు.. నీళ్లు సక్కరావు.. ఇదీ వీళ్ల పరిపాలన.. ఎవరినైనా ఉద్ధరించారా? నీళ్లు రావు.. కరెంటు రాదు.. సాగునీరు రావు.. ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా? దేశంలే.. కట్టలే.. మాకు చేయ చేతకాదు.. నువ్వు చేస్తే చేయనియ్యం అనే పద్ధతిలో మాట్లాడుతున్నరు.. భారతదేశంలో 24గంటలు మోటర్, ట్రాన్స్‌ఫార్మర్ కాలకుండా మంచి నాణ్యమైన కరెంటు ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ. బీజేపీ పరిపాలించే కాడ లేదు.. ప్రధానమంత్రా సొంత రాష్ట్రం గుజరాత్‌లో లేదు. ఇవాళ కరెంటు కూడా బంద్ చేస్తరటా.. మీటర్ పెట్టాలే.. వచ్చే కరెంటు రాకుంట బంద్ చేయాలే.

అబద్ధాలు చెప్పాలే.. అబద్ధాలు మాట్లాడాలే.. దేశ ప్రజానీకానికి, రైతాంగానికి నిష్కృతిరావాలంటే.. ఈ డూప్లికేట్ అవసరం లేని ఉప ఎన్నికలు తెచ్చే గోల్‌మాల్‌గాళ్ల నుంచి మనన్ని మనం కాపాడుకోవాలంటే మన బాయికాడ, బోరుకాడ బీజేపీ మీటర్ పెట్టుడు కాదు.. అందరం ఒక్కటై బీజేపీకే మోటార్ పెట్టాలే. మన పీడపోతదని నేను మనవి చేస్తున్నా' అని అన్నారు. పెడుదామా బీజేపీకి మీటరు?.. పక్కా మాటేనా?..' అని సీఎం కేసీఆర్ అనగా.. పెడుదాం అంటూ జనం నినదించారు. 'మీరు ఒక్కొక్కరు ఒక్క కేసీఆర్ కావాలే.. కొందరు మనదాంటో సన్నాసులు ఉంటరు.. కొంద మందుపెట్టి దూది పెట్టగానే దాని వెంబడిపోతరు. దానికి ఆశపడద్దు. దయచేసి ప్రలోభాలకు పోవద్దు.. ఒక్కటే మాట చెబుతున్న పార్టీల ఎన్నిక కాదు.. రైతుల బతుకుదెరువు ఎన్నిక. రైతుల పొలాల్లో పని చేసే కార్మికుల బతుకుదెరువు ఎన్నిక. తెలంగాణ యొక్క జీవితం.. ఇది మంచిది కాదు' అన్నారు.

### రూపాయి విలువ పడిపోతుంది..

'దేశంలో మతపిచ్చి, కులపిచ్చి మంచిదా? ఎవరిని ఉద్ధరించడానికి, ఎవర్ని బాగుచేయడానికి? అందరూ

బాగుండాలి.. అందులో మనం బాగుండాలని కోరుకోవాలి కానీ.. ఒక విద్వేషం.. అసహ్యం పుట్టిస్తే.. ఇవాళ దేశంలో ఏం జరుగుతోంది.. చాలా ప్రమాదంలోకి వెళ్తోంది. రూపాయి విలువ ఏ ప్రధాని టైమ్‌లో పోలే ఇంత అధ్వాన్నంగా? 80 రూపాయలా? ఇదే ప్రధాని మోదీ చెప్పిండు.. నన్ను గెలిపించండి.. రూపాయి విలువ అధమ స్థాయికి పడిపోయింది మోదీ పాలనలోనే. నిరుద్యోగం పెరిగింది. కార్మికులు రోడ్డునపడుతున్నరు. ఉన్న సంస్థలను అమ్ముతున్నరు. రైతులను బతుకనిస్తరలేదు. పండిన పంటలను కొంటలేరు. మనదగ్గర మనం తిప్పలు పడుదామంటే కూడా.. ఇది కూడా బంద్ పెట్టాలే.. దీన్ని కూడా కొండిపెట్టాలే..

ఇవాళ రేపు బంద్ చేస్తరో మీరు అడగాలే.. ఓ గంటా? రెండు గంటలు కరెంటు పోతే ఎంత బాధైతది? కష్టపడి.. ఎన్నోరకాల బాధలుపడి కొన్ని ఖర్చులు తగ్గించైనా సరే బ్రహ్మాండంగా కరెంటు ఇచ్చుకుంటున్నం.. పరిశ్రమలు వస్తున్నయ్. పిల్లలకు ఉద్యోగాలు దొరుకుతున్నయ్. ఐటీ పరిశ్రమ పెరుగుతున్నది. వ్యవసాయంలో పంటలు బాగా పండుతున్నయ్. ఎవరికి అక్కర ఉన్నప్పుడు వారు బోరు పెట్టుకుంటున్నరు. ఆనందంగా సంతోషంతో బతుకుతున్నరు. బతుకనియ్యం.. చెడగొడుతం అంటున్నరు.. మళ్లీ చండూరు కూడా సభ పెట్టుకుందాం. మీ దీవెన ఉన్నంత వరకు.. కేసీఆర్ బతికున్నంత వరకు తెలంగాణ రైతాంగానికి మీటరు పెట్టను.. ఎట్టి పరిస్థితుల్లో రైతుబంధు ఆగదు' అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

## పుస్తక ప్రదర్శనతో సమాజానికి సందేశం : సీఎస్ సోమేశ్‌కుమార్



హైదరాబాద్, ఆగష్టు 20: 'మంచి పుస్తకం మన చెంత ఉంటే మంచి మిత్రుడు లేని లోటు తీరినట్లే'నన్న గాంధీ చెప్పిన సూక్తిని యువతరం ఆకలింపు చేసుకొని, పుస్తక పఠనం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ పిలుపునిచ్చారు.

వజ్రోత్సవాల సందర్భంగా సీఎం కేసీఆర్ దేశాల మేరకు రాష్ట్ర సాహిత్య అకాడమీ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ప్రత్యేక పుస్తక ప్రదర్శనను ఎల్బీ స్టేడియం టెన్నిస్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశాయి.

డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇతర సీనియర్ అధికారులతో కలిసి సీఎస్ సోమేశ్ సందర్శించారు.

ఈ సందర్భంగా సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా సీఎం కేసీఆర్ సంకల్పం మేరకు ద్విసప్తాహ కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు.

వజ్రోత్సవాల సందర్భంగా గాంధీ ఆశయాలను, భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేసే కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వజ్రోత్సవ పుస్తక ప్రదర్శన మంచి సందేశాన్ని సమాజానికందించిందని తెలిపారు. ఈ తరంలోకి గాంధీ భావాలను తీసుకుపోవాలన్న కేసీఆర్ ఆలోచనలకు ప్రతీకగా పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయడాన్ని అభినందించారు.

అంతకు ముందు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా స్టాల్స్‌ను సందర్శించారు. ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గాంధీ చరకాను, చేనేత మగ్గాన్ని, ఎద్దు గానుగ యంత్రాన్ని ఆసక్తిగా తిలకించారు. పుస్తక ప్రదర్శనను చక్కగా ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. అనంతరం సీఎస్‌కు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ చరకాను బహుకరించారు.

కార్యక్రమంలో సీపీ సీవీ ఆనంద్, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, అడిషనల్ డీజీ జితేందర్, పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉన్నత విద్యా శాఖ కమిషన్ నవీన్ మిట్టల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, రవాణా శాఖ కమిషనర్ బుద్ధా ప్రకాశ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, హైదరాబాద్ కలెక్టర్ అమయ్ కుమార్, టీఎస్ఐసీసీ నరసింహారెడ్డి, సమాచార శాఖ డైరెక్టర్ బీ రాజమౌళి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ గున్నా రాజేందర్ రెడ్డి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ సెక్రెటరీ కోయ చంద్రమోహన్, యానాల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజాదీవెన సభలో గులాబీ జెండా ఎగుర వేసిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, ఆగష్టు 20: ప్రజాదీవెన సభలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గులాబీ జెండా ఎగుర వేశారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా భారీ కాన్వాయ్‌తో సీఎం కేసీఆర్ మునుగోడుకు చేరుకున్నారు. పెద్ద ఎత్తున గులాబీ శ్రేణులు సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకగా.. అభివాదం చేస్తూ సభ వేదికకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలవేశారు. అనంతరం సభకు మంత్రి జగదీశ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014కు ముందు మునుగోడులో దీనపరిస్థితులు ఉండేవన్నారు. ఎడారిలాంటి జిల్లాను సీఎం సస్యశ్యామలంగా మార్చారన్నారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ రక్కసిని సీఎం పారద్రోలారన్నారు. గతంలో ఎక్కడికి వెళ్లినా నల్గొండ జిల్లా గురించి చెప్పేవారు.

## పాక్‌లో ఐఈడీ పేలుళ్లు : ఇద్దరు పోలీస్ అధికారుల మృతి

న్యూఢిల్లీ, ఆగష్టు 20: పాకిస్తాన్‌లోని ఖిబర పక్తున్‌ఖ్వ ప్రావిన్స్‌లో పోలీస్ అవుట్‌పోస్ట్ సమీపంలో ఐఈడీ పేలుడు సంభవించడంతో ఇద్దరు పోలీసు అధికారులు మరణించారు. దేశ భద్రతా దళాలు లక్ష్యంగా ఇటీవల దాడులు జరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోందని అధికారులు పేర్కన్నారు.

ఇదే ప్రావిన్స్‌లోని టంక్ జిల్లాలో వ్యాక్సినేషన్ డ్యూటీలో పాల్గొన్న ఇద్దరు పోలీస్ అధికారులను ఇటీవల ఉగ్రమూకలు బలితీసుకున్నాయి. జులైలో డెరా ఇస్మాయిల్ ఖాన్, టంక్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో మోటార్ బైక్‌లపై వచ్చిన గుర్తుతెలియని దుండగులు నలుగురు పోలీసులను కాల్చి చంపారు. ఇక ఇదే తరహాలో జూన్‌లో నార్త్ వజీరిస్తాన్ ట్రైబల్ జిల్లాలో భద్రతా దళాల కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిలో పది మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారని డాన్ పత్రిక పేర్కొంది.

## తెలంగాణ గడ్డపై బీజేపీ అడుగుపెడితే వినాశనమే : సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 20: తెలంగాణ గడ్డపై బీజేపీ అడుగుపెడితే విశానమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మునుగోడు ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో తాము సైతం కేసీఆర్‌తో కలిసే పోరాడామన్నారు.

ఇప్పుడు మీ ఎజెండానే మా ఎజెండా అని సీఎం కేసీఆర్ అన్నారని తెలిపారు. దేశ రాజకీయ పరిస్థితులతోనే టీఆర్ఎస్ కు మద్దతిస్తున్నట్లు పేర్కొన్నారు.

మా పోరాటం కేసీఆర్‌ను గద్దె దించేందుకు కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మా పోరాటమని స్పష్టం చేశారు. బీజేపీని ఓడగొట్టేందుకు టీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామన్నారు. మునుగోడు ప్రాంతంలోని సమస్యలన్నింటి పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఇక్కడ అభివృద్ధి జరుగాలనే తాము పోటీలో ఉండడం లేదని, మునుగోడు ప్రజలు టీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించాల్సి ఉందన్నారు. సీపీఐ పార్టీ నేతలు, కార్యకర్తలు ఇందు కోసం పని చేస్తారన్నారు.

## 21న హరితహారాన్ని విజయవంతం చేయాలి : ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 20: స్వతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా ఈ నెల 21న చేపట్టిన ప్రత్యేక హరిత హారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి అల్లో ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. వినూత్నంగా చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుందన్నారు.

రాష్ట్రంలో గ్రీనరీ 7.7శాతం పెరిగిందని, కోట్లాది మొక్కలు నాటిన ఫలితంగా పర్యావరణం పరిరక్షించబడి.. వర్షాలు సమయానుకూలంగా బాగా కురుస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకలు రావడం.. దీన్ని అద్భుత అవకాశాన్ని తీసుకొని ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కను నాటి, సంరక్షించాలని కోరారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఆయాశాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# భారతదేశ దూరదర్శన్ టీవీకి 63 - ఏండ్లు

## (స్వతంత్ర భారత వజ్రోత్సవ సందర్భంగా సవాళ్లను దాటుతూ సాఫల్యత వైపు స్వదేశీ పయనం)

దేశంలో నేడు వినోదాల కార్యక్రమాలు, జాతీయ అంతర్జాతీయ వార్తలు, ఇతర దృశ్య శ్రవణ ప్రసారాలను ప్రజల కోరిక మేరకు అందిస్తున్న సాధనంగా టీవీ మానవాళికి అమూల్య సేవలను అందిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సంఘటనల దృశ్యాలను, వీడియోలను, ప్రత్యక్ష ప్రసారాలను క్షణాల్లో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా ఇంటింటికి చేరవేయడంలో టెలివిజన్ ప్రముఖ పాత్రను నిర్వహిస్తున్నది. సుదూర దృశ్యాలను అందరి దరికి చేర్చే బహుళ ప్రచార సాధనమే దూరదర్శన్ అని పిలుస్తున్నాం. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో డిడి లేదా దూరదర్శన్ ప్రసారాలు 15 సెప్టెంబర్ 1959న ప్రారంభించబడింది. ప్రసార భారతిలో అత్యంత పెద్ద వ్యవస్థగా స్టూడియోలు, ట్రాన్స్‌మిటర్లతో టీవీ ప్రసారాలను ప్రజల చేరువకు తీసుకువస్తున్నది. నేటి దూరదర్శన్‌లో ఉపగ్రహ టీవీ, సమాచార ప్రసారాలు, ఇంటర్నెట్, ఓటిటి లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి ఇంటికి వివిధ వైవిధ్య భరిత కార్యక్రమాలను ప్రసారం చేయగల అత్యవసర ఎలక్ట్రానిక్ ఉపకరణం అయ్యింది. 'సత్యం శివం సుందరం' అనే నినాదంతో హిందీ, ఆంగ్లం, ఇతర ప్రాంతీయ భాషల్లో ప్రసారాలను ప్రతి క్షణం దేశ నలుమూలలకు అందిస్తున్నది.

### దూరదర్శన్ విస్తరణ:

1959లో ఢిల్లీ కేంద్రంగా 40 కిమీ పరిధిలో ప్రారంభమైన దూరదర్శన్ ద్వారా బ్లాక్ అండ్ వైట్ ప్రసారాలు, 1965లో రేడియోతో కలిసి నిత్యం డిడి ప్రసారాలు ప్రారంభమైనాయి. 1965లో బొంబాయి, అమృత్‌సర్ నగరాల్లో డిడి ప్రసార కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1972 వరకు ఏడు నగరాలకు విస్తరించింది. 01ఏప్రిల్ 1976న రేడియో, డిడి విభాగాలు వేరు చేయబడగా, 1982లో పూర్తి స్థాయి జాతీయ ప్రసారాలను కలర్ టీవీల ద్వారా ఆసియా క్రీడల వార్తలను కూడా చేయగలిగే స్థాయికి ఎదిగింది. నేడు దేశవ్యాప్తంగా 46 స్టూడియోలు, 21 టీవీ చానెల్స్, 17 ప్రాంతీయ ఉపగ్రహ చానెల్స్, 11 రాష్ట్ర నెట్‌వర్కులు, అంతర్జాతీయ చానెల్, స్పోర్ట్స్ చానెల్, డిడి కిసాన్, డిడి భారతి, డిడి ఉర్దూ, డిడి రెట్రో లాంటివని సేవలు అందిస్తున్నాయి. 2018లో అరున్‌ప్రభ, 2019లో మరో 11 రాష్ట్రాల ప్రాంతీయ భాషా చానెల్స్ ప్రారంభమైనవి.

### రామాయణ్ సీరియల్ ప్రభంజనం:

1987-88లో "రామాయణ్" సీరియల్ ప్రసారంతో దూరదర్శన్ ఇంటింటా కనీస అవసరమై పూజలను అందుకుంది. దాని తరువాత 1988-89లో 'మహాభారత్' సీరియల్ ప్రసారంతో డిడి ప్రాచుర్యం ఆకాశాన్నంటింది. 1959లో రేడియో, టీవీ ప్రసారాలకు ఉద్దేశించిన ఒక్క స్టూడియో నుంచి నేడు 66 స్టూడియోలు, 34 ఉపగ్రహ చానెల్స్ నిత్యం ఉచిత ప్రసారాలను అందిస్తున్నది. దేశవ్యాప్తంగా అనేక టీవీ చానెల్స్ ప్రసారాలు అందుబాటులో ఉన్నప్పటికీ దూరద్శన్ ప్రసారాలకు ఆదరణ తగ్గడం లేదు. నేడు 146 దేశాలకు డిడి ఇండియా ప్రసారాలు చేరుతున్నాయి. నాడు డిడిలో ప్రసారమైనా రామాయణ్ సీరియల్‌ను 7.7 కోట్ల ప్రేక్షకులు చూడడం ఓ ప్రపంచ రికార్డుగా నిలిచింది. నేడు రాజ్యసభ, లోకసభ ప్రత్యక్ష ప్రసారాలను కూడా డిడి అందిస్తున్నది. టెలివిజన్ లేని మానవాళిని ఊహించలేం. రేడియో ఒక్కటే వార్తా ప్రసారాల సాధనంగా భావించిన మానవాళికి మరో వరంగా టీవీ ప్రసారాలు ప్రపంచానికి అత్యంత అబ్బుర పరిచే వార్తలు, వినోదాలు, ప్రత్యక్ష ప్రసారాలను చూస్తున్నాం. నేడు రేడియో, టెలివిజన్‌లు సామాన్యడి వినోద ఉపకరణాలుగా ఇంటింటా వెలసి దృశ్య శ్రవణ విందును చేస్తున్నాయి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# బూస్టర్ డోస్ ఆగస్టు నెలాఖరులోగా 100% పూర్తి చేసేలా కృషిచేయాలి .

## - జిల్లా వైద్య అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా.శరత్ .

సంగారెడ్డి , ఆగస్టు 20 ( నేటి నిజం ప్రతినిధి) ఆగష్టు నెలాఖరు వరకు కరోనాకు సంబందించిన బూస్టర్ డోస్ ను 100% పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.శరత్ జిల్లా వైద్య అధికారులకు ఆదేశించారు .

శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బూస్టర్ డోస్ పై డి యం ఎచ్ ఓ , డి ఐ ఓ, డిప్యూటీ డి యం ఎచ్ ఓ లు మెడికల్ ఆఫీసర్స్ లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు 46 శాతం పూర్తి అయిన ప్రక్రియ ఆగష్టు నెలాఖరులోగా 100 శాతం పుర్తవ్వడానికి అందరు కృషి చేయాలని తెలిపారు. ప్రక్రియలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తిసుకవస్తే పరిస్కరిస్తానని ఆయన వారికి తెలిపారు.

# కుక్కను కొట్టి చంపిన ఘటనపై కేసు నమోదు

కరీంనగర్ , ఆగష్టు 20: మూగజీవాల సంరక్షణ పట్ల తమకున్న బాధ్యతను మరోసారి చాటారు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ కొత్తపల్లి మండల కేంద్రంలో శునకాన్ని కర్రలతో కొట్టి హింసించి హతమార్చిన సంఘటనపై కేసు నమోదు చేయించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి మండల కేంద్రంలోని సంగెం చౌరస్తాలో ఈ నెల 15వ తేదీన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు శునకాన్ని కర్రలతో చితకబాదారు. ఈ సంఘటనలో సదరు శునకం మృతి చెందింది. ఈ సమాచారం అందుకున్న హైదరాబాద్ నల్లకుంట ప్రాంతానికి చెందిన జంతు సంరక్షణ సంస్థ వ్యవస్థాపకులు పృధ్వి పన్నీరు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తూ మాజీ కేంద్ర మంత్రి, సంజయ్ గాంధీ జంతు సంరక్షణ కేంద్రం వ్యవస్థాపకురాలు మేనకా గాంధీకి సమాచారం అందించారు. మాజీ ఎంపీ మేనకా గాంధీ స్పందిస్తూ శుక్రవారం రాత్రి పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణతో మాట్లాడి దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు తగు చర్య నిమిత్తం కొత్తపల్లి ఎస్ఐని ఆదేశించారు. విచారణ జరిపిన పోలీసులు ఈ సంఘటనపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. గతంలో పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ పిల్లి బావిలో పడిన సంఘటనపై స్పందిస్తూ దాని రక్షణకు చర్యలు తీసుకున్న విషయం విధితమే. తాజాగా శునకాన్ని చిత్రహింసలకు గురిచేసి హతమార్చిన సంఘటనపై స్పందిస్తూ కేసు నమోదు చేయించారు.






# దేశభక్తిని ప్రతిబింభించేలా మహిళలు ముగ్గులు వేయడం ఎంతో అభినందనీయం

## ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేలా చూడాలి

## జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు

## మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్, ఆగష్టు 20 (నేటినిజం ప్రతినిధి): స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఈనెల 8వ తేదీ నుంచి చేపట్టిన ఆయా






కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా విజయవంతమయ్యాయని ఈ విషయంలో ప్రతి ఒక్కరూ దేశభక్తిని అందరికీ తెలియజేసే కార్యక్రమాలు చేపట్టామని ఎంతో సంతోషకరమని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఆవరణలో మెదక్ జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రతినిత్యం ఒక కార్యక్రమాన్ని చేపట్టిందని దీని ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వారి గురించి తెలియడంతో పాటు ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించేందుకు తోడ్పడ్డాయని పేర్కొన్నారు. ప్రభుత్వం గత పదమూడు రోజులుగా చేపట్టిన అన్ని కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా విజయవంతం కావడం ఎంతో ఆనందంగా ఉందని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమన్వయంతో ఇది సాధ్యమైందని అన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాలను ప్రతి గ్రామపంచాయతీ, మండలాలు, జిల్లాలో నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉద్యోగులకు క్రీడలు నిర్వహించి బహుమతులు అందచేశామని... రక్తదాన శిబిరాలు కూడా నిర్వహించి వాటిని విజయవంతం చేసినట్లు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు.

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, మండలాల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించడంతో అన్ని కార్యక్రమాలు విజయవంతమయ్యాయని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్?లో మహిళలు వేసిన ముగ్గులను అదనపు కలెక్టర్? ప్రతిమాసింగ్ పరిశీలించారు. మహిళలు వేసిన ముగ్గులు దేశభక్తిని, స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలను తెలియజేసేలా... దేశభక్తిని ప్రతిబింభించేలా ఎంతో బాగున్నాయని వారిని అభినందించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్?, అదనపు పీడీ భీమయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్? కుమార్?, జిల్ సైన్స్? అధికారి రాజిరెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రూపాయి ఖర్చు లేకుండా పేదలకు రెండు పడకల ఇళ్లు : మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట, ఆగష్టు 20: రూపాయి ఖర్చు లేకుండా, ఎలాంటి పైరవీలకు తావులేకుండా ప్రతి పేదోడికి ఇళ్లు అందించడమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి హరీశ్ రావు అన్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా నిరుపేదలకు రెండు పడకల ఇళ్లు అందిస్తున్నామని చెప్పారు.

జిల్లాలోని పాలమాకులలో కొత్తగా నిర్మించిన 23 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలోనే సొంతజాగాలో ఇళ్లు కట్టుకునే వారికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇండ్ల నిర్మాణం కోసం ఇచ్చే పైసలు బేస్‌మెంటుకు కూడా సరిపోయేవి కాదని విమర్శించారు. కానీ తెలంగాణ ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా ఇళ్లు కట్టించి తాళం చేతిలో పెట్టి లబ్ధిదారులకు అప్పగిస్తున్నామన్నారు.

# జిల్లా కేంద్రంలోని అనాధ ఆశ్రమాలు , జిల్లా జైళ్లను సందర్శించిన జిల్లా కలెక్టర్.



సంగారెడ్డి , 20 ( నేటి నిజం ప్రతినిధి) స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలలో బాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ డా.శరత్ సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని అనాధ ఆశ్రమాలు , వృద్దాశ్రమాలను , జిల్లా జైలను సందర్శించారు.

సంగారెడ్డిలోని రెండు వృద్దాశ్రమాలను సందర్శించిన కలెక్టర్ 115 మంది వృద్దులకు పండ్లు, స్వీట్లు పంచారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ స్వతంత్ర భారత వజ్రోత్సవాలలో బాగంగా ఈ నెల 8 నుండి అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అనాధ ఆశ్రమాల లోని పిల్లలు బాగా చదువుకొని వృద్ధి లోకి రావాలని మంచి స్థాయిలో పిల్లలు ఉండాలని ఆకాక్షించారు.

అనంతరం కంది లోని జిల్లా జైలును సందర్శించి అక్కడ 450 మంది ఖైదీలకు పండ్లు స్వీట్లు పంచి పెట్టారు. అక్కడ ఖైదీలతో మాట్లాడుతూ సత్ ప్రవర్తనతో ఉండాలని మరల ఎలాంటి నేరాలు చేయకుండా ఉండాలని వారితో అన్నారు. సత్ ప్రవర్తనతో ఉంటె త్వరగా విడుదల అవుతారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషథ్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, జిల్లా ఎస్.పి. రమణ కుమార్ అదనపు కలెక్టర్ రాజర్షి షా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు కాళ్లకి దండం పెట్టి ఓట్లు అడుగుతాం-రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 19: ఓటుని అడగడంలో ఎన్నో టెక్నిక్స్ ఉన్నాయి. నగదు..గిఫ్ట్స్ ఇలా ఎవరికి నచ్చిన రీతిలో వారు ఓట్లు అడుగుతుంటారు. కాగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నేతలు సమావేశమయ్యారు. ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా గెలవాలని అందరు తీర్మానించారు. అయితే గెలవటం ఎలాగన్నదే అసలు సమస్య. అందుకోసం ప్రచారంలో కొత్తపంథాని అనుసరించాలని డిసైడ్ అయ్యారట. ఇంతకీ అదేమిటంటే ఓట్లేయమని ఓటర్లను అభ్యర్థించటం చేతులు పట్టుకుని కాళ్ళనుకోమని అనటం మామూలుగా జరిగేదే. అయితే దాన్నే ఆచరణలోకి తీసుకురావాలని సమావేశం నిర్ణయించిందట. ప్రచారానికి వెళ్ళినపుడు ప్రతిఓటరు కాళ్ళకి దండం పెట్టి ఓట్లడగాలని ఫైనల్ చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా మొత్తం లక్షమంది ఓటర్ల కాళ్ళను మొక్కి ఓట్లడగబోతున్నారట.ప్రతి గ్రామానికి ఐదుగురు నేతలకు ప్రచార బాధ్యతలను అప్పగించాలని కూడా సమావేశం నిర్ణయించింది. కాళ్ళకుమొక్కి ఓట్లేడిగే ప్రచారాన్ని ముందు రేవంత్ రెడ్డే ప్రారంభించబోతున్నారట. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంత అవస్తలు పడుతున్నదనేందుకు ఈ నిర్ణయమే తాజా ఉదాహరణ.

# బీజేపీని ఓడించే సత్తా టీఆర్ఎస్‌కే ఉంది: చాడ వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 20: బీజేపీని ఓడించే సత్తా టీఆర్ఎస్‌కే ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. అందుకే మునుగోడు ఉపఎన్నికలో తాము టీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నామని చెప్పారు. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా జాతీయ పార్టీ తీర్మానం ఉందన్నారు. మునుగోడు ఉపఎన్నికపై హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం చాడా వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఉపఎన్నికల్లో సీపీఐ నిలబడే పరిస్థితి లేదని చెప్పారు. అందువల్ల బీజేపీని ఓడించే పార్టీకే మద్దతు ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

ఇది మునుగోడుకే పరిమితం కాదని, భవిష్యత్‌లో కూడా టీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మునుగోడు బహిరంగ సభకు రావాలని సీఎం కేసీఆర్ తమను ఆహ్వానించారని చెప్పారు. సీపీఐ నేతలు సభలో పాల్గొంటారని తెలిపారు. 2018 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమను ఇబ్బంది పెట్టిందని చెప్పారు. తమకు కేటాయించిన మూడు సీట్లలో కూడా వారి అభ్యర్థులు పోటీచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజగోపాల్ రెడ్డి స్వార్థ ప్రయోజనాల వల్లే ఉపఎన్నిక వచ్చిందని విమర్శించారు.

ఉపఎన్నికల్లో టీఆర్ఎస్ మద్దతు ఇవ్వాలని సీపీఐ నేతలను సీఎం కేసీఆర్ కోరిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి.. ముఖ్యమంత్రితో ప్రగతిభవన్‌లో 2 గంటలపాటు చర్చించారు.

# తొర్రూరులో ఘనంగా రంగోలి ముగ్గుల పోటీలు



మహబూబాబాద్, ఆగష్టు 20: (నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర దినోత్సవ వజ్రోత్సవాల సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ఘనంగా రంగోలి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గులను పలువురు న్యాయ నిర్ణేతలు పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు మున్సిపల్ వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డితో కలిసి మున్సిపల్ కమిషనర్ గుండె బాబు బహుమతులుగా చీరలను పంపిణీ చేశారు. ప్రధమ బహుమతి ఏఎల్ఎఫ్ తులసి, ద్వితీయ బహుమతి ఏ ఎల్ఎఫ్ భద్రకాళి, తృతీయ బహుమతి ఏఎల్ఎఫ్ చాముండేశ్వరి, మహేశ్వరి లకు అందజేశారు. అదేవిధంగా ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ గుండె బాబు మాట్లాడుతూ 75వ స్వాతంత్ర సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న వజ్రోత్సవాల్లో భాగంగా ఈ ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలు ఇలాంటి ముగ్గుల పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఏఈ సిహెచ్.రంజిత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, కౌన్సిలర్లు భూసాని రాము, కొలుపుల శంకర్, నర్కుటి గజానంద్, సునీత జైసింగ్, మాధవి అనిల్, ఉపాధ్యాయుడు కిషన్ నాయక్, మహిళా సంఘం అధ్యక్షురాలు విజయ, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి : శైలజానాథ్

అమరావతి, ఆగష్టు 20: వైసీపీ హయాంలో రైతులు దోపిడీకి గురవుతున్నారని ఏపీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురంలో కాంగ్రెస్ నేతల వినూత్న నిరసన చేపట్టారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పాతూరు కూరగాయల మార్కెట్?ను పరిశీలించి.. కూరగాయల ధరలను శైలజానాథ్ అడిగి తెలుసుకున్నారు. కొత్తిమీర కట్ట అమ్ముతూ నిరసన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతోనే నిత్యావసరాల ధరలు పెరిగాయని తెలిపారు. నిత్యావసరాల ధరల పెంపును వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 4న ఢిల్లీ రామ్?లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని శైలజానాథ్ ప్రకటించారు.

## జిల్లా కోర్టు భవన సముదాయాన్ని ప్రారంభించిన ఎన్వీరమణ-పాల్గొన్న సీఎం జగన్



అమరావతి, ఆగష్టు 20: విజయవాడలో జిల్లా కోర్టు భవన సముదాయాన్ని ప్రారంభించారు సీజేఐ ఎన్వీరమణ.ఈ కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొన్నారు. కాగా ఒకే భవనంలో 31కోర్టులు ఉంటాయి.2013 మే 13న ఈ భవనానికి శంకుస్థాపన చేశారు.

వందకోట్లతో ఎనిమిది అంతస్తుల్లో భవనాన్ని నిర్మించనున్నారు. తాను శంకుస్థాపన చేసిన భవనాన్ని పదేళ్ల తర్వాత ప్రారంభోత్సవం చేయడం సంతోషంగా ఉందన్నారు ఎన్వీ రమణ.

అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ భవనం ఆలస్యానికి చాలా కారణాలు ఉన్నాయన్నారు.సిటీ సివిల్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు ఎన్వీ రమణ. రూ.92.60కోట్లతో 3.70ఎ కరాల్లో కోర్టు నిర్మాణం జరుగనుంది. 8వ అంతస్తులో 200మంది సామర్థ్యంతో ఆడిటోరియం..మీటింగ్ హాల్..ఉండనున్నాయి.

## నెల్లూరులో సప్తవర్ణశోభితంగా శ్రీవారి పుష్పయాగం



నెల్లూరు జిల్లా , ఆగష్టు 20: శ్రీవేంకటేశ్వర స్వామి వైభవోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వైభవోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన శనివారం ఉదయం నిర్వహించిన పుష్పయాగం సప్తవర్ణ శోభితంగా నిలిచింది. ఈ వేడుకకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వైభవోత్సవాలు టీటీడీ నిర్వహిస్తున్నది. సుగంధాల్ని వెదజల్లే రంగు రంగుల పుష్పాలు, పత్రాలతో ఈ పుష్పారాధన వేడుకగా జరిగింది. పుష్పార్చన జరుగుతుండగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి దివ్యమనోహర రూపాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. శ్రీవారి నమూనా ఆలయంలో ఉదయం 6 గంటలకు సుప్రభాతం, 6.30 నుంచి 7.30 గంటల వరకు తోమాలసేవ, కొలువు, 7.30 నుంచి 8.15 గంటల వరకు అర్చన, 8.15 నుంచి 8.30 గంటల వరకు నివేదన, శాత్తుమొర నిర్వహించారు.

ఉత్సవాల్లో గానీ, నిత్యకైంకర్యాల్లో గానీ అర్చక పరిచారకులు, అధికార అనధికారులు, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణ వల్ల సమస్తదోషాలు తొలగిపోతాయని విశ్వాసం. ఇందులో భాగంగా అర్చకులు 108 సార్లు విష్ణు గాయత్రి మంత్రాన్ని పఠించి పుష్పాలకు అధిపతి అయిన పుల్లుడు అనే దేవుడ్ని ప్రసన్నం చేసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి భక్తులను కాపాడాలని శ్రీవేంకటేశ్వరస్వామిని వేడుకుంటూ భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు శ్రీవైష్ణవాలయాల్లో పుష్పయాగం నిర్వహిస్తారు.

ఉదయం 8.15 గంటలకు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం వైభవంగా జరిగింది. తులసి, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు వంటి 12 రకాల పూలు, ఆరు రకాల ఆకులు కలిపి మొత్తం రెండు టన్నుల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు యాగం నిర్వహించారు. ఆద్యంతం శోభాయమానంగా సాగిన ఈ పుష్పయాగ మహోత్సవాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా వేద పండితులు రుగ్వేదం, శుక్లయజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదాలను పఠించారు. చివరగా నక్షత్ర హారతి ఇచ్చారు. అనంతరం టీటీడీ గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, న్యూఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తిరుమల ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ, జిల్లా ఎస్పీ విజయారావు, అదనపు ఎస్పీ శ్రీమతి హిమవతితోపాటు పలువురు అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మునావార్ షోకి ఫుల్ ప్రొటెక్షన్.. శిల్పకళా వేదిక వద్ద పోలీసు బందోబస్తు

హైదరాబాద్, ఆగష్టు 20: హైదరాబాద్‌లోని మాదాపూర్ (హైటెక్ సిటీ)లో స్టాండప్ కమెడియన్ మునవర్ ఫరూఖీ ప్రదర్శన ఇవ్వబోతున్న శిల్పకళా వేదిక వద్ద పెద్ద ఎత్తున సెక్యూరిటీ పెట్టారు. రైట్‌వింగ్ గ్రూపుల నుండి ఇబ్బందులను ఊహించి పోలీసు అధికారులు ఆ ప్రాంతంతో పాటు చుట్టుపక్కల పోలీసుల బలగాలను మోహరించారు. సైబరాబాద్ పోలీసులు వేదిక వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సఫారీ డ్రెస్‌లు ధరించిన ప్రత్యేక బృందాలు కార్యక్రమ వేదిక దగ్గర కనిపించారు. అదేవిధంగా శిల్పకళా వేదిక వద్దకు వెళ్లే వేదిక, రోడ్ల చుట్టూ యూనిఫాం ధరించిన పోలీసులను కూడా మోహరించారు. ఏదైనా అత్యవసర అవసరానికి సమీపంలో అగ్నిమాపక యంత్రాన్ని కూడా ఉంచారు.

సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులు పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. మునావర్ ఫరూఖీపై ఎలాంటి అంతరాయం లేదా దాడి జరగకుండా ఉండేందుకు పోలీసులు సాధారణ దుస్తుల్లో గస్తీ కాస్తున్నారు. శిల్ప కళావేదికలో క్లోజ్డ్ నిఘా కెమెరాలను ఏర్పాటు చేశారు. టెలివిజన్ సెట్‌లు, కంప్యూటర్‌లలో జరుగుతున్న సంఘటనలను ఒక బృందం పర్యవేక్షిస్తోంది.

# మునుగోడు టీఆర్ఎస్ దే.. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 20: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మునుగోడు స్థానాన్ని టిఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో కైవసం చేసుకోవడం ఖాయమని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. ఆదివారం మధ్యాహ్నం మునుగోడులో సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరైన ప్రజా దీవెన సభకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలోని ప్రతినిధులు టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు 500 కార్లతో భారీ కాన్వాయ్ తో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో జెండా ఊపి కాన్వాయ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన తీర్పును అగౌరవ పరుస్తూ, తన వ్యక్తిగత వ్యాపార అవసరాల నిమిత్తం రాజీనామా చేసిన మునుగోడు మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ప్రజలు గట్టి గుణపాఠం చెప్తారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మునుగోడు స్థానాన్ని టీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు పటాన్ చెరు నియోజకవర్గం నుండి అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో బయలుదేరి వెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పామాయిల్ ఢమాల్.. రెండు నెలల్లోనే పడిపోయిన ధర

అమరావతి, ఆగష్టు 20: పామాయిల్ రైతుల ఆనందం ఆవిరైంది. రెండు నెలల క్రితం వరకు మంచి రేటు వచ్చిందనే ఆనందంలో ఉన్న రైతులంతా ఒక్కసారిగా నీరుగారారు. ఆల్‌టైమ్ రికార్డులో నిలిచిన పామాయిల్ ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో కుదేలయ్యారు. దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇటీవల పామాయిల్ గెలల ధరను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆయిల్‌పామ్ రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా, రైతులెవ్వరూ ఊహించని రీతిలో పామాయిల్ గెలలకు నెలనెలా ధర పెరుగుతూ వస్తుండడంతో రైతులు ఎంతో ఆనందపడ్డారు. నవంబరు నుంచి పామాయిల్ గెలల ధరలో పెరుగుదల ప్రారంభమైంది. జనవరి నెలలో పామాయిల్ గెలలు టన్ను ధర రూ.17 వేలు మార్కును చేరు కోవడంతో రైతులు ఆనందించారు. ఆ తరువాత ఫిబ్రవరి నుంచి గణనీయంగా పెరుగుతూ మే నెలలో ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేస్తూ ఏకంగా రూ.23,365లకు చేరుకుంది.

ఇది ఆయిల్‌పామ్ చరిత్రలో అత్యధికం. నెల రోజుల వ్యవధిలోనే ధరలు తగ్గి ప్రస్తుతం అది కాస్తా ఇప్పుడు రూ.16,911లకు చేరుకుంది.ఒక్కసారిగా ధరలు పతనం మే నెలలో పామాయిల్ ధరలు టన్ను రూ.23,365 ఉంటే జూలై నెలలో రూ.16,912లకు పడిపోయింది.

అంటే రెండు నెలల వ్యవధి లోనే ఒక టన్నుకు రూ.6,453 రైతులు కోల్పోయారు. అత్యధిక ధర పలకడంతో రైతులు పెట్టుబడులను అమాంతం పెంచేశారు. ఒకప్పుడు టన్ను లోడింగ్ చార్జీకి ఇప్పటి లోడింగ్ చార్జీలకు డబుల్ అయ్యాయి. ఒక్కో మనిషికి గెలలను నరికేందుకు రూ.1000 పై మాటే. ఇక కౌలు విషయానికొస్తే ఎకరం రూ.40 వేల నుంచి ప్రస్తుతం గరిష్టంగా రూ.1.15 లక్షల వరకు వెళ్లింది. గత రెండు నెలల క్రితం అయితే అసలు పామాయిల్ తోటల కోసం ఎంతో మంది రైతులు కాళ్లరిగేలా తిరిగినా కౌలుకు దొరకలేదంటే ఎంత డిమాండ్ పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే ప్రస్తుతం పరిస్థితులు తల్లకిందులయ్యాయి. ఇప్పుడు కౌలు రైతులంతా దిగాలు చెందుతున్నారు. పెరిగిన కౌలు ధరలతో పాటు కూలి, ట్రాన్స్‌పోర్ట్, ఇతరత్రా ఖర్చులు చూసుకుంటూ ఇప్పుడున్న పరిస్థితుల్లో అప్పులు పోగేసుకోక తప్పదని ఆవేదన చెందుతున్నారు. దీనికి తగ్గట్టు ప్రతీ నెల ధరల్లో వ్యత్యాసం, పక్క రాష్ట్రాలకు ఇక్కడకు తేడా ఉండం రైతులను మరింత క్షోభకు గురిచేస్తోంది.

మిగిలిన పంటల సాగుకు పామాయిల్ సాగుకు ఎంతో వ్యత్యాసం ఉంది. ఇతర పంటలైతే లాభదాయకంగా లేకపోతే ప్రత్యామ్నాయ పంట సాగుకు వెళ్లే అవకాశం ఉంటుంది. దీనికి ఆ అవకాశం కూడా లేదు. మొక్క నాటి నుంచి 30 ఏళ్ల పాటు పామాయిల్ పంట పండించాల్సిందే. రాష్ట్రంలో 9 జిల్లాల్లో1.81 లక్షల హెక్టార్లలో 1.32 లక్షల మంది రైతులు ఆయిల్‌ఫామ్ సాగు చేస్తున్నారు.కేవలం ఉమ్మడి గోదావరి జిల్లాల్లో సుమారు 76,860 హెక్టార్లలో ఆయిల్‌ఫామ్ సాగు చేస్తున్నారు. ఎకరానికి 9, 10 టన్నుల దిగుబడి సాధిస్తే ప్రతీ ఏడాది 5 లక్షల టన్నుల దిగుబడి వస్తుంది.

# వనపర్తికే తలమానికం తిరుమలయ్య గుట్ట : మంత్రి నిరంజన్‌రెడ్డి



వనపిర్త, ఆగష్టు 20: తిరుమలయ్య గుట్ట వనపర్తికే తలమానికమని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శ్రావణమాసం సందర్భంగా తిరుమలయ్యగుట్టను మంత్రి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా తిరుమలేశుడిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత అంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్నారు. భక్తులకు మంత్రి స్వయంగా వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అరుదైన వనమూలికలకు తిరుమలయ్య గుట్ట అటవీప్రాంతం ప్రసిద్ధి అనీ, ఈ ప్రాంతంలో మరింత పెద్ద ఎత్తున మొక్కలను పెంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

తిరుమలయ్య గుట్ట చుట్టూ సుందరీకరణ గుట్ట పైకి వెళ్లేందుకు రహదారి వెంట మెట్లు ఏర్పాటు చేస్తామని, వాహనాలకు ఇబ్బంది లేకుండా, పాదాచారులకు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతామన్నారు. గుట్టమీద నీటి సౌకర్యం కల్పిస్తామని, వాహనాల పార్కింగ్‌కు శాశ్వత ఏర్పాట్లు చేస్తామన్నారు. అన్నిరంగాల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, అన్నివర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందుతుందన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, అమ్మ ఒడి, ఆసరా పింఛన్లు తెలంగాణలోనే విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సంక్షేమ పథకాల అమలుకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్న ఘనత కేసీఆర్‌దేనన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 140 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.44.52లక్షల విలువైన చెక్కులను అందజేశారు. మంత్రి వెంట జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి ఉన్నారు.

# ఇంద్ర మేగ్వాల్ హత్య పై ప్రధానమంత్రి వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 23 న విద్యా సంస్థల బంద్

### -ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ

సంగారెడ్డి ఆగస్టు 20 (నేటి నిజం ప్రతినిధి) రాజస్థాన్ లో కుల హత్యకు గురైన ఇంద్ర మేగ్వాల్ విషయంలో




ప్రధానమంత్రి మౌనం వహించడాన్ని నిరసిస్తూ ఆగస్టు 23 న జాతీయ స్థాయిలో విద్యా సంస్థల బంద్ కు నిర్వహిస్తున్నామని, అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలు స్వచ్ఛందగా బంద్ పాటించి సహకరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ శనివారము నాడు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఇంద్ర మేగ్వాల్ హత్యను నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కోర్టు నుండి జ్యోతిరావు పూలే, జగ్జీవన్ రాం విగ్రహాల వరకు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ దేశాన్ని పాలిస్తున్న ప్రధానమంత్రికి దళితుల పట్ల ఏ మాత్రం సానుభూతి లేదని, అంటరానితనాన్ని నిర్మూలన కోసం చేసిన చట్టాలను మోడి ప్రభుత్వం సరిగ్గా అమలు చేయకపోవడం వల్ల రాజస్థాన్ లో దళిత విద్యార్థి ఇంద్ర మేగ్వాల్ హత్య జరిగిందని ఆయన అన్నారు.ఇంద్ర మేగ్వాల్ హత్య మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలిస్తే ప్రధానమంత్రి మాత్రం హృదయం లేని వ్యక్తిగా మౌనంగా ఉన్నారని అన్నారు. ప్రధానమంత్రి మౌనం వహించడం అంటే నిందితులకు కొమ్ముకాస్తున్నట్లే ఉందన్నారు. తక్షణమే ప్రధానమంత్రి స్పందించి ఇంద్ర మేగ్వాల్ కుటుంబాన్ని సందర్శించాలని, నిందితులకు జీవిత ఖైదు విధించాలని, కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేసారు.వీటి సాధన కోసం ఆగస్టు 23 న జాతీయ స్థాయిలో కేజీ నుంచి పీజీ వరకు ఉన్న అన్ని రకాల విద్యా సంస్థల బంద్ కు పిలుపునిస్తున్నామని,ఈ బంద్ లో అన్ని వర్గాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వ విద్యా సంస్థల సిబ్బంది, ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్ పెట్టి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నేత ముక్కగళ్ళ ఆంజనేయులు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్ల కన్వీనర్ మైశాగల్ల బుచ్చేంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ మాతంగి చిరంజీవి మాదిగ ఎం ఆర్ పి యస్ సీనియర్ నాయకులు గంగేరి శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ యువసేన జిల్ల కన్వీనర్ శివ రామకృష్ణ మాదిగ ,యం యస్ ఎఫ్ జిల్ల కన్వీనర్ దేవులపల్లి మహేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ హత్నూర మండల ఇంచిర్జ్ కొండని శ్రీకాంత్ మాదిగ ,యం యస్ ఎఫ్ నాయకులు దవు ఆదిత్య మాదిగ ఆలాగే విద్యార్థినిలు లావణ్య,శ్రీలత,పూజ, మౌనిక,సంజన,కవిత, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర వజ్రోత్సవ వేడుకలో ముగ్గుల పోటీలు



మహబూబాబాద్, ఆగష్టు 20: (నేటినిజం ప్రతినిధి): భారత స్వతంత్ర వజ్రోత్సవ వేడుకలో భాగంగా పెద్దవంగర మండలంలోని అన్ని గ్రామాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వడం జరిగింది. చిట్యాల గ్రామంలో జెడ్పిఎస్ఎస్ పాఠశాలలో మహిళలు నిర్వహించిన ముగ్గుల పోటిలకు ముఖ్య అతిథిగా ఎంపిపి ఈదురు రాజేశ్వరి హాజరై మాట్లాడుతూ ఈ వజ్రోత్సవాలను ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేస్తున్నారని , ఆదివారం రోజున జరిగే హరిత హారం, మొక్కలు పెట్టే కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఎక్కువ మొత్తంలో మొక్కలు పెట్టాలని కోరారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలో విజేతలుగా గెలిచిన మహిళలకు ఎంపీపీ తమ సొంత ఖర్చులతో టిఫిన్ బాక్సులు, బహుమతులు షీల్డ్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఎంపిడిఓ బి. వేణుగోపాల్ రెడ్డి, డిపిఎం నళిని, తెరాస మండల పార్టీ అధ్యక్షులుఈదురు ఐలయ్య, ఎపిఎం నరేందర్ కుమార్, జూనియర్ పంచాయతీ కార్యదర్శి రాగిరి రాజు, సిసి సుజాత, సిఎ లు తోట స్వాతి, రాయిపెల్లి మమత, గుంటుక రమ, అంగన్వాడీ టీచర్లు పులుగుజ్జా శోభా, ఈదురు సునీత, పులుగుజ్జా రాజేశ్వరి, ఈదురు శోభ, పాక దుర్గ, విద్యా కమిటీ చైర్మన్ ఆకుతోట జ్యోతి మహిళాలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

## మరోసారి మానవత్వం చాటుకున్న ఎంపీ రంజిత్ రెడ్డి



రంగారెడ్డి, ఆగష్టు 20: చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఘటనలో గాయపడ్డ బాధితుడిని తన వాహనంలో దవాఖానకు తరలించి ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. మంచి వైద్యం అందించాలని డాక్టర్లకు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈరోజు వరంగల్ లో వివాహ కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో ఔటర్ రింగ్ రోడ్డుపై ఎంపి రంజిత్ రెడ్డి ప్రయాణిస్తుండగా ప్రమాదంలో గాయపడి ఒక వ్యక్తి రక్తం మరకలతో కనబడ్డారు. ఆ వ్యక్తిని చూసిన వెంటనే తన కారు ఆపి వారి వద్దకు వెళ్ళి ప్రమాదం ఎలా జరిగిందని అరా తీసి.. వెంటనే తన వాహనంలో కర్మన్ ఘాట్ గ్లోబల్ అవేర్ ఆస్పత్రికి పంపించారు. మంచి వైద్యం అందించాలని అక్కడి డాక్టర్లను ఫోన్ ద్వారా ఆదేశించారు.

## మనాలిలో చిక్కుకుపోయిన విశాఖ కార్పొరేటర్లు

అమరావతి, ఆగష్టు 20: అధ్యయన యాత్రకు వెళ్లిన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు మనాలిలో చిక్కుకుపోయారు. మనాలి నుంచి చండీగఢ్ వెళ్లే మార్గంలో లారీపై బండరాళ్లు పడటంతో లారీ బోల్తా పడింది.

దాంతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫలితంగా విశాఖకు చెందిన 95 మంది కార్పొరేటర్ల బృందం మనాలిలోనే ఉండిపోవాల్సి వచ్చింది. అందరూ క్షేమంగా ఉన్నారని తెలుస్తున్నది.

మనాలి–చండీగఢ్ రహదారిలో జోరుగా కురుస్తున్న వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ మార్గంలో వెళ్తున్న ఓ లారీపై పెద్దపెద్ద రాళ్లు పడటంతో లారీ బోల్తాపడింది. దాంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

ఫలితంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ సమస్య తలెత్తింది. వాన జోరుగా కురుస్తుండటం, రోడ్డు ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో మనాలి వద్ద కార్పొరేటర్ల పర్యటన నిలిచిపోయింది.

కార్పొరేటర్లు ప్రయాణిస్తున్న ప్రాంతానికి సమీపంలోనే ఈ ఘటన చోటుచేసుకున్నది. చండీగఢ్ బయల్దేరేందుకు బస్సులో బయల్దేరిన విశాఖ కార్పొరేటర్లు రాత్రంతా బస్సులోనే జాగారం చేశారు. మహిళా కార్పొరేటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అయితే కార్పొరేటర్లందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందింది.

విశాఖ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 10 గంటల తర్వాత ఈ రహదారిని క్లియర్ చేసే అవకాశాలు ఉన్నాయి.

ఈ బృందం తదుపరి చండీగఢ్‌కు బయల్దేరుతుంది. ఉత్తర ఆంధ్రలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్‌లకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ అధ్యయన పర్యటనలో ఉన్నారు.

ఈ నెల 23న వీరంతా వైజాగ్‌కు తిరిగి రానున్నారు. కార్పొరేటర్లు అంతా క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందడంతో వారి కుటుంబసభ్యులు, మద్దతుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## 2024లో టీడీపీకి రిటైర్మెంట్ తప్పదు.. అంబటి రాంబాబు

అమరావతి, ఆగష్టు 20: 2024లో టీడీపీకి రిటైర్మెంట్ తప్పదని ఏపీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. చంద్రబాబుపై ఆయన మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబుకు అంబేద్కర్ గుర్తుకు రాలేదన్నారు. అధికారంలో ఉండగా.. సొంత నియోజకవర్గం వారే తప్ప చంద్రబాబుకు వేరే వారు గుర్తుకు రాలేదన్నారు. 2018లో పోలవరం పూర్తి చేస్తానని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కాఫర్ డ్యాం పూర్తి చేయకుండానే డయాఫ్రం వాల్ ను ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. పోలవరాన్ని నాశనం చేయడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మంత్రి అంబటి రాంబాబు అన్నారు.

# శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

నిజామాబాద్, ఆగష్టు 20: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 59,240 క్యూసెక్కుల నీరు వస్తున్నది. దీంతో అధికారులు 12 గేట్లు ఎత్తి 49,980 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీరామ్?సాగర్ పూర్తి నీటిమట్టం 1091 అడుగులు. ప్రస్తుతం 1089 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నది. ప్రాజెక్టు గరిష్ట నీటినిల్వ సామర్థ్యం 90 టీఎంసీలుకాగా, ఇప్పుడు 84.810 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# కెనడా స్టూడెంట్ వీసా ఆలస్యంపై వ్యక్తి ఆత్మహత్య- ఆ తర్వాత వచ్చిన వీసా

చండీగఢ్, ఆగష్టు 20: కెనడా స్టూడెంట్ వీసా ఆలస్యాన్ని భరించలేక ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే అతడు మరణించిన రెండు రోజుల తర్వాత వీసా వచ్చింది. హర్యానాలోని కురుక్షేత్ర జిల్లాలో ఈ విషాద సంఘటన జరిగింది. షహబాద్ సబ్ డివిజన్‌లోని గూర్ఖా గ్రామానికి చెందిన వికేశ్ సైనీ అలియాస్ దీపక్ డిగ్రీ పూర్తి చేశాడు. దీంతో కెనడా వెళ్లి చదువుకుని అక్కడ స్థిరపడాలని నిర్ణయించుకున్నాడు. దీనికి అతడి తల్లిదండ్రులు కూడా అంగీకరించారు.

దీపక్ కొన్ని నెలల కిందట స్నేహితులతో కలిసి కెనడా స్టూడెంట్ వీసా కోసం దరఖాస్తు చేశాడు. ఇటీవల వారికి వీసాలు వచ్చాయి. అయితే తనకు వీసా రాకపోవడంపై అతడు దిగులు చెందాడు. దీంతో జన్సా సమీపంలోని కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

మరోవైపు దీపక్ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వెతకడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం కాలువ వద్ద అతడి బైక్, చెప్పులను గుర్తించారు. దీంతో గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా మృతదేహం లభించింది. పోస్ట్‌మార్టం అనంతరం దీపక్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అయితే గురువారమే దీపక్ ఇంటికి వీసా వచ్చిందని ఆ గ్రామ మాజీ సర్పంచ్ గుర్నామ్ సింగ్ తెలిపాడు. అప్పటికే అతడు ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పాడు. పోలీసులు ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రోజుకు ఎన్ని అరటిపండ్లు తినొచ్చు.. అతిగా తింటే వచ్చే సమస్యలు..

హైదరాబాద్, ఆగష్టు 20: అరటి పండు అనేద ఇన్‌స్టంట్ ఫుడ్. శరీరంలో తొందరగా జీర్ణమయి వెంటనే శక్తిని అందజేస్తుంది. అందుకే మనకు ఏ టైంలోనైనా భోజనం అందుబాటులో లేనపుడు రెండు అరటి పండ్లు తింటే ఆకలి తీర్చుకుంటారు. ఇది సామాన్యులకు కూడా అందుబాటులో ఉంటుంది. అరటి పండులో చాలా పోషకాలుంటాయి. ముఖ్యంగా ః6, విటమిన్ అ పుష్కలంగా ఉంటాయి. మెగ్నిషియం, పొటాషియం మాంగనీస్, ఫైబర్ లు అరటి పండులో మెండుగా ఉంటాయి. అరటి పండును మితంగా తింటే నష్టమేమీ ఉండదు. రోజుకి రెండు లేదా మూడు పండ్లు తింటే సమస్య ఉండదని డాక్టర్లు చెబుతారు.

బనానా పండును ఎక్కువ మోతాదులో తింటే పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అరటి పండు ఎక్కువగా తినేవాళ్లలో మలబద్ధక సమస్య ఏర్పడే చాన్స్ ఉంటుందంటున్నారు. రెగ్యులర్‌గా బనానా ఎక్కువ మోతాదులో తింటే అందులో ఉండే కొన్ని రసాయనాలు మైగ్రేన్‌ని ప్రేరేపిస్తాయి.

# మథురలో జన్మాష్టమి వేడుకలు.. తొక్కిసలాటలో ఇద్దరు మృతి



మథుర, ఆగష్టు 20: యూపీలోని మథురలో ఉన్న ప్రఖ్యాత బంకీ బిహారీ ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. అయితే శనివారం ఉదయం భారీ సంఖ్యలో భక్తులు రావడంతో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఆ తొక్కిసలాటలో ఇద్దరు భక్తులు మృతిచెందినట్లు తెలుస్తోంది. మరో ఏడు మంది గాయపడ్డారు. తెల్లవారుజామున 1.45 నిమిషాలకు మంగళ హారతి సమయంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో ఊపిరి ఆడక ఇద్దరు భక్తులు మృతిచెంది ఉంటారని జిల్లా మెజిస్ట్రేట్ నవనీత్ సింగ్ చాహల్ తెలిపారు. తొక్కిసలాటలో నోయిడాకు చెందిన 55 ఏళ్ల మహిళతో పాటు జబల్‌పూర్‌కు చెందిన 65 ఏళ్ల వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు...



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 20: (నేటినిజం ప్రతినిధి): మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను చందుర్తి మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి నాగం కుమార్. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు చింతపంటి రామస్వామి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కేక్ కట్ చేసి సీట్లు,పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో దేశ ప్రజలందరం అనుభవిస్తున్నటువంటి ఈ శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక,ఫలాలు. కంప్యూటర్స్.ఎన్నో ఐటీ రంగాలకు పునాదులు వేసినటువంటి ఘనత రాజీవ్ గాందిదే అని గుర్తు చేశారు. అదే విధంగా పౌరుల ఓటు హక్కు 21 ఏళ్ల నుండి 18 ఏళ్లకు ఉదయించడం ,దేశ సేవలో ముందుండి నడిపిన గొప్ప నేత ఉగ్రవాదుల చేతిలో మరణించడం దేశానికి తీరని లోటన్నారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ మ్యాకల గణేష్.నాయకులు పులి సత్యం,వేల్పుల దేవా స్వామి. డీసీసీ ప్రధాన కార్యదర్శి గొట్టే ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇందూరి మధు, నాయకులు బొజ్జ మల్లేశం,సంటి ప్రసాద్,డబ్బెటి వెంకటేశం,దారం చంద్రం,పోతరాజు రవి,లక్కర్సు శేకర్,తోటనరేందర్,నలుమాసు రవీందర్ రెడ్డి,దేవుడు మల్లేశం, ఉలిసే ఆంజనేయులు,నాగం గణేష్,తిప్పని శంకర్ తదితరులు పాల్గొన్నారు,

# రంగోలి పోటీలో మహిళలు ప్రత్యేకతను, ప్రతిభను చాటుకున్నారు-జిల్లా కలెక్టర్ కె.శశాంక



మహబూబాబాద్, ఆగష్టు 20: (నేటినిజం ప్రతినిధి): రంగోలి పోటీలో మహిళలు నిర్దేశించిన సమయంలో జాతీయయ్యత భావంతో జెండా రంగుల్లో ముగ్గులు వేసి ప్రత్యేకతను, ప్రతిభను, నైపుణ్యాన్ని చాటుకున్నారని జిల్లా కలెక్టర్ కె. శశాంక అన్నారు.

శనివారం ముగ్గుల పోటీలను శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించబడగా సుమారు 30మంది మహిళలు పాల్గొని రంగు రంగులతో ఆకర్షణీయమైన ముగ్గులను జాతీయత పెంపొందే విధంగా, పండుగ వాతావరణంలో పాల్గొని ముగ్గులు వేశారు.

స్వతంత్ర భారత వజ్రోత్సవాలలో భాగంగా నేడు ముగ్గుల పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ విచ్చేసి మాట్లాడుతూ, వజ్రోత్సవాల్లో భాగంగా ప్రతి ఒక్కరిలో జాతీయత పెంపొందెలా 15 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇందులో భాగంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా, గ్రామ, పట్టణ, జిల్లా కేంద్రాల్లో సంప్రదాయాన్ని, జాతీయతను చాటే విధంగా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఉదయాన్నే లేచి ఇల్లును శుభ్రపరుచుకుని ముగ్గులు వేసి, ప్రతి ఇంటిని అందంగా తీర్చిదిద్దే బాధ్యత ఎలా ఉంటుందో ఈ సమాజాన్ని కూడా అలానే చక్కదిద్దుటలో మీ వంతు బాధ్యత ఉండాలని, సమాజనీలో ఉన్న అందరిని వేడుకల్లో భాగస్వాములను చేసే వినూత్న కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, జాతీయతా భావంతో స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ జిల్లాలో ఘనంగా పండుగ వాతావరణంలో వేడుకలను నిర్వహించుకొంటున్నామని కలెక్టర్ తెలిపారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ షీల్డ్ లను అందజేశారు. కన్సోలేషన్ బహుమతిని కలెక్టర్ చేతుల మీదుగా వార్డ్ కౌన్సిలర్ ఎడ్ల వేణు పుస్తకాలను, పెన్నులను, చిన్నారులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ నాగవాణి, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, జడ్పీ సీఈఓ రమాదేవి, డిప్యూటీ సీఈఓ నర్మద, పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, జిల్లా అడిట్ అధికారిని ప్రతిభ, సఖి అడ్మిన్ శ్రావణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ లు వార్డు కౌన్సర్స్ ఎడ్ల వేణు, అధికారులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల త్యాగాలను స్మరించుకునేందుకే స్వాతంత్ర్య వజ్రోత్సవాలు: మంత్రి ఎర్రబెల్లి



వరంగల్, ఆగష్టు 20: మహనీయుల త్యాగాలను స్మరించుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల పాటు స్వతంత్ర్య భారత వజ్రోత్సవ ద్వి సప్తాహ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. 75వ స్వతంత్ర భారత వజ్రోత్సవం ద్విసప్తాహ వేడుకలలో భాగంగా శనివారం వరంగల్ మహా నగరపాలక సంస్థ ఆవరణలో జిడబ్లుఎంసి ప్రాంగణంలో రూ.10.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అశోక స్థూపాన్ని మంత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలను మంత్రి ప్రారంభించారు. వీటిలో మెప్మా, ఐసిడిఎస్ లకు చెందిన 150 మంది మహిళలు వేసిన ముగ్గులను మంత్రి పరిశీలించారు. స్వయంగా మంత్రి ఎర్రబెల్లి ముగ్గులు వేశారు.

వేసిన కొన్ని ముగ్గులకు రంగులు అద్దారు. మంత్రితో పాటు కమిషనర్ ప్రావీణ్య కూడా ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, వరంగల్ మహా నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యే నరేందర్, డిప్యూటీ మేయర్ రిజ్వాన శమీమ్ మసూద్, పలువురు కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, బల్దియా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. ప్రతి ఇంటా జెండా ఎగరవేయడంతోపాటు స్వతంత్ర పోరాటంలోని మహనీయుల త్యాగాలను స్మరించుకునే విధంగా పదిహేను రోజుల పాటు రోజుకో కార్యక్రమాన్ని నిర్వహించి స్వాతంత్ర్య స్ఫూర్తిని, దేశభక్తి, సమైక్యతా భావం, ప్రతి ఒక్కరిలో కలిగేలా ఈ ఉత్సవాలను నగరంతో పాటు ప్రతి మండలం, గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహిస్తున్నారని చెప్పారు.

అహింసా మార్గంలో ఆనాడు గాంధీజీ, నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్ సాధించిన భారత స్వతంత్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని అహింసా మార్గంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు.

సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో ముందు ఉందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు అందించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ అని కేంద్ర ప్రభుత్వం అనేక అవార్డులు ఇచ్చిందన్నారు. ఉపాధి హామీ పథకంలో దేశంలోనే అధిక పని దినాలు కల్పించడంలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్, కాళేశ్వరం ప్రాజెక్టు చూసిన తర్వాత ప్రపంచంలోనే అద్భుతమైన నెంబర్ వన్ ప్రాజెక్ట్ అని కేంద్రం కితాబిచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తున్నది కానీ నిధులు మంజూరు చేయడం లేదన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పురపాలక శాఖ మాత్యులు కేటిఆర్ దిశానిర్దేశంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ దేశంలోనే నంబర్ వన్‌గా ఉందన్నారు.

రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వరంగల్ మహానగర అభివృద్ధికి పాటుపడాలని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

రంగురంగుల ముగ్గులు కూడా సృజనాత్మక కళగా మంత్రి పేర్కొన్నారు. ముగ్గులు వేసిన మహిళలను మంత్రి అభినందించారు. అనంతరం వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు రంగోలి మరియు ఉత్తమ సేవలు అందించిన బల్దియా ఉద్యోగులకు మంత్రి దయాకరరావు, చీఫ్ విప్ వినాయభాస్కర్, మేయర్ సుధారాణి, కమిషనర్ ప్రావీణ్య, కార్పొరేటర్ల చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బల్దియా అడిషనల్ కమిషనర్ రషీద్, సెక్రెటరీ లక్ష్మి, ఉప కమిషనర్ లు, మెప్మా పిడి బల్దియా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది మెప్మా, ఆర్‌పిలు, సివోలు, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తే సహించేది లేదు

## - టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు షేక్. అఫ్జల్ హసన్





ఖమ్మం, ఆగష్టు 20: (నేటినిజం ప్రతినిధి): వ్యవసాయ శాఖ లో ఏఈఓ లు (వ్యవసాయ విస్తరణ అధికారులు) గా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులపై పై స్థాయిలో ఉన్న ఏవో, ఏడీఏ, ఏఈవోలను వేధింపులకు గురిచేస్తే సహించేది లేదని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు షేక్. అఫ్జల్ హసన్ హెచ్చరించారు.

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు షేక్.అఫ్జల్ హసన్, ప్రధాన కార్యదర్శి ఆర్.వి.ఎస్.సాగర్ లను ఖమ్మం కలెక్టరేట్ లోని టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయంలో శనివారం వ్యవసాయ శాఖ లో విధులు నిర్వహిస్తున్న ఏఈఓ లు కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం ను అందజేశారు.

కొన్ని మండలాల్లో ఏవో, ఏడీఏ, ఏఈవోస్ ఏఈవోల వ్యక్తిగత జీవితంలోకి ఇన్వాల్వ్ అయ్యి అసభ్య పదజాలంతో దూషించడం, మహిళా

ఏఈఓ లతో అసభ్యంగా మాట్లాడటం ఏఈఓ లుగా జాయిన్ అయ్యి ఐదేళ్లు గడిచిన కొన్ని డివిజన్ లలో సర్వీస్ రెగ్యులైజేషన్ చేయకపోవడం, పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోవడం వల్ల ఏఈఓ లు మానసికంగా క్షోభను అనుభవిస్తున్నట్లు చెప్పారు. ఏఈఓ ట్రాకర్ యాప్ వల్ల వ్యక్తిగత సమాచారానికి ఆటంకం కలుగుతోందని ఏఈఓ లు గోడు వెళ్లబుచ్చారు.

రైతుబంధు, రైతు భీమా, పీఎం కిసాన్ పంటల నమోదు మరియు పలు రకాల పథకాలను ఒకే సమయం లో పూర్తి చేయమనడంతో తీవ్ర ఒత్తిడి కి గురవుతున్నట్లు వెల్లడించారు.

ఏఈఓ లపై క్లస్టర్ కు ఒక ఏఈఓ వచ్చినప్పటి నుంచి జిల్లాలోని అన్ని రకాల పనులలో ఏఈఓ లను ముందంజలో ఉంచుతున్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో తమకు మోయలేని పనిభారం పెంచిందని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హసన్ కు ఆవేదన వ్యక్తం చేశారు.

పంటల నమోదు కు వెళ్తే సర్వే నెంబర్ తెలియకపోవడంతో నమోదు కష్టతరంగా మారింది. ప్రభుత్వం దృష్టికి తక్షణమే సమస్యను తీసుకెళ్లాలని అఫ్జల్ హసన్ ని ఏఈఓ లు కోరగా స్పందించిన ఆయన డీ ఏ ఓ తో ఫోన్ లో చర్చించి సమస్యను ముందుగా జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ దృష్టికి టిఎన్జివోఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్, ద్వారా ,వ్యవసాయశాఖ రాష్ట కమిషనర్, కి, జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కి, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అదేవిధంగా వేధింపులకు గురి చేస్తున్న ఏఓ, ఏడీఏ లపై చర్యలు తీసుకునేంత వరకు ఉపేక్షించేది లేదని ఏఈఓ లకు అఫ్జల్ హసన్, భరోసా ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఈఓ ల సంఘం నాయకులు అఫ్రీన్,నాగులు మీరా, మహేష్,సరిత, రవీందర్,అన్ని మండలాల ఏఈఓ లు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# నిండు నూరేళ్లు చల్లగా ఉండాలి

## - టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు జన్మదిన వేడుకల్లో తుంబూరు దయాకర్ రెడ్డి



ఖమ్మం, ఆగష్టు 20: (నేటినిజం ప్రతినిధి): సమాజ శ్రేయస్సుకు తనవంతు పాటుపడుతూ... క్రమశిక్షణే ధ్యేయంగా టీఆర్ఎస్ పార్టీకి విధేయుడిగా ఉంటున్న పార్టీ జిల్లా నాయకులు కోసూరి శ్రీనివాసరావు నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంఛార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కోసూరి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డి వేడుకల్లో ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. పుట్టినరోజు వేడుకకు హాజరైన వారు కోసూరి శ్రీనివాసరావు కి కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుమ్మా రోశయ్య, కొణిజర్ల ఎంపీపీ గోను మధు, జిల్లా నాయకులు రాయలపుల్లయ్య, ఏలూరి శ్రీనివాసరావు, పోట్లపల్లి శేషగిరిరావు, దొడ్డపనేని రామారావు, తాళ్లూరి చిన్నపుల్లయ్య, సూడా డైరెక్టర్ బండారు కృష్ణ, నాయకులు కొనకంచి మోషే, ఇంజం పిచ్చయ్య, లక్ష్మయ్య, ఇంజం వెంకటేశ్వర్లు, చల్లగుండ్ల నురేష్, తేజావత్ మదన్, గడల నరేందర్ నాయుడు, లకావత్ దేవేందర్, సురభి వెంకటప్పయ్య, కనగంటి రావు, షేక్ జాన్పాషా, చల్ల కోటేశ్వరరావు, మద్దిన్ని ఆదినారాయణ, చల్ల భాస్కర్, తదితరులు ఉన్నారు.

# 420 పార్టీలో విజయసాయి, కొడాలి నాని 840 లు : బుద్ధా వెంకన్న

అమరావతి, ఆగష్టు 20: వైసీపీ నేతలు విజయసాయిరెడ్డి, కొడాలి నానిపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరూ 420 అనే పార్టీలో 840 లని విరుచుకుపడ్డారు. ఎన్నో భూ కబ్జాలు చేసిన వైసీపీ నేతలు.. విశాఖలో వృద్ధాశ్రమానికి చెందిన భూముల్ని సైతం వదలట్లేదని విమర్శించారు. అక్కడి భూ బాధితుల కోసం కాల్ సెంటర్ ఏర్పాటు చేసి వివరాలు సేకరించి పోరాటం చేస్తామన్నారు.

వైసీపీ పార్టీ ముందే 420 కాగా.. ఆ పార్టీలోని విజయసాయిరెడ్డి, కొడాలి నాని 840 అని బుద్ధా వెంకన్న వ్యాఖ్యానించారు. విశాఖలో వైసీపీ నేతల ఆగడాలు శృతిమించిపోతున్నాయన్నారు. అన్ని నగరాల్లో భూకబ్జాలకు పాల్పడుతున్న 420 పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెప్తారన్నారు. విశాఖపట్నంలో గంటలో ఘోరం, అర్ధగంటకో భూకబ్జాకు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎందరో బాధితులు వీరిని ప్రశ్నించలేక నోరు మెదపక ఉంటున్నారని చెప్పారు. ఇలాంటి వారికి అండగా నిలిచేందుకు పార్టీ తరపుణ కాల్ సెంటర్ ఏర్పాటుచేస్తామన్నారు. త్వరలో విశాఖలో పర్యటించి హయగ్రీవ వృద్ధాశ్రమ భూముల్ని పరిశీలిస్తామని వెంకన్న చెప్పారు.

తాడేపల్లిలో జగన్ బటన్ నొక్కుతుండగా.. మరోవైపు వైసీపీ నేతలు కెమెరాల ముందు బట్టలు విప్పుతున్నారని బుద్ధా వెంకన్న దుయ్యబట్టారు. ఇలాంటి నాయకుడ్ని ఇంకా పార్టీలో పెట్టుకుంటున్నారు ఎందుకో ప్రజలకు చెప్పాలన్నారు. ఎంపీ గోరంట్ల వ్యవహారంపై వైసీపీ మహిళా నేతలు నోరు విప్పాలని, తమకు ఎంత మేర అవమానం జరుగుతుందో పార్టీ అధినేతకు చెప్పే ధైర్యం చేయాలని సూచించారు.

# ఒకే కాన్పులో నలుగురు శిశువులు

హైదరాబాద్, ఆగష్టు 20: నిలోఫర్ దవాఖానలో ఓ మహిళ ఒకే కాన్పులో నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు పూర్తి ఆరోగ్యంతో క్షేమంగా ఉన్నారని నిలోఫర్ దవాఖాన గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజేశ్వరి తెలిపారు. ఐదు లక్షల మందిలో ఒకరికి జరిగే ఇలాంటి కాన్పులో సాధారణంగా తల్లీ, బిడ్డలకు క్లిష్టమైన పరిస్థితులు ఉంటాయని, కానీ తమ కృషి వల్ల అంతా సానుకూలంగా జరిగిందని పేర్కొన్నారు.

ఖైరతాబాద్‌లోని ఎంఎస్ మక్తాకు చెందిన సయ్యద్ ఇమ్రాన్‌ఘోరీ, అమీనా ఉన్నిస్సా దంపతులకు ఇద్దరు సంతానం. మూడోసారి గర్భం దాల్చిన అమీనాకు స్కానింగ్ చేయగా ఆమె కడుపులో నలుగురు శిశువులు ఉన్నట్టు స్థానిక దవాఖాన సిబ్బంది తెలిపారు. దీంతో ఆమెను 6వ నెల చివరలో దవాఖానలో చేర్చుకున్నామని డాక్టర్ చెప్పారు. 8 నెలలు నిండిన అమీనాకు 14న నొప్పులు రావడంతో సిజేరియన్ ద్వారా ముగ్గురు మగ, ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. నిలోఫర్‌లో జరిగే ప్రసవాలలో ప్రతి నెలా 25 నుంచి 30 వరకు కవలలు జన్మిస్తుంటారు. నెలలో కనీసం ఒకసారి ముగ్గురు శిశువులు జన్మిస్తుంటారు. కాని ఒకే కాన్పులో నలుగురు శిశువులు జన్మించటం, వారంతా క్షేమంగా ఉండటం అరుదు.



## టిడిపి రాష్ట్ర అధ్యక్షుడుని కలిసి రాజన్న ప్రసాదం అందజేసిన పులి రాంబాబు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 20: (నేటినిజం ప్రతినిధి): హైదరాబాద్ ఎన్టీఆర్ భవన్ లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు బక్కని నర్సింహులు ని శనివారం వేములవాడ టిడిపి నియోజకవర్గం ఇన్చార్జ్ పులి రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రసాదం అందజేశారు .అనంతరం తెలుగుదేశం పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి పులి రాంబాబు గౌడ్ నినియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులుసూచించారని పేర్కొన్నారు.

## కబ్జాకు గురైన రూ.2 కోట్ల విలువైన భూమి రెవిన్యూ శాఖ స్వాధీనం..

భద్రాద్రి కొత్తగూడెం, ఆగష్టు 20 (నేటినిజం ప్రతినిధి) : కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పురపాలక సంఘం పరిధిలోని కబ్జాకు గురైనా రూ. 2 కోట్ల విలువైన భూమిని రెవిన్యూ శాఖ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి కబ్జా వ్యవహారం పై జిల్లా కలెక్టర్ అనుదీప్ విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఆర్డిఓ స్వర్ణలత ను ఆదేశించారు. కలెక్టర్ ఉత్తర్వులు మేరకు కబ్జాకు గురైన భూమి వద్దకు ఆర్డీఓ స్వర్ణలత అధర్యంలో సింగరేణి ఎస్టేట్, పురపాలక అధికారులు వెళ్లి విచారించారు. ప్రభుత్వ భూమిగా గుర్తించారు. కబ్జా స్థలంలో నిర్మించిన ప్రహరీ గోడలు తొలగించాలని రెవిన్యూ, పురపాలక అధికారులకు సూచించారు. భూమిలో ఉన్న చెట్లను తొలగించి భూమిని చదును చేసి మొక్కలు నాటించాలని సింగరేణి ఎస్టేట్ అధికారులకు చెప్పారు.

## అల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు ఎంపికలు

మెదక్, ఆగష్టు 20 (నేటినిజం ప్రతినిధి):2022-23 సం,,లో భారత ప్రభుత్వము నిర్వహించు అల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ సెలక్షన్ ట్రయల్స్ ఈ క్రింద చూపబడిన వివిధ క్రీడ అంశములలో 23-08-2022 వ తేదిన జిల్లా స్థాయి ఎంపికలు జరుగును.
1.అథ్లెటిక్స్ 2.బాడ్మింటన్ 3. బాస్కెట్బాల్ 4.క్రికెట్(స్త్రీడపు) 5.చెస్ 6.క్యారమ్స్ 7.ఫుట్ బాల్ 8. హాకీ (స్త్రీడపు) 9. కబడ్డీ (స్త్రీడపు) 10.లాన్ టెన్నిస్ 11. పవర్ లిఫ్టింగ్ 12.స్విమ్మింగ్ 13.టేబుల్ టెన్నిస్ 14.వాలీబాల్(స్త్రీడపు) 15. వెయిట్ లిఫ్టింగ్ 16.ఃవబబి జూష్ఠఎబతిఇ 17.రెజ్లింగ్(స్త్రీడపు) కావున పైన చూపిన క్రీడల అంశములయందు ఆసక్తి కలిగిన వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేయుచున్న మెదక్ జిల్లాకు చెందిన ఉద్యోగులు (పర్మనెంట్ ఉద్యోగులు మాత్రమే) వారి యొక్క సర్వీస్ సర్టిఫికేట్ మరియు ఇటివల తీసిన ఐడెంటిటీ కార్డు తో, తేది:22.08.2022 సాయంత్రం 5.00 గంటల లోపు తమ పేర్లను సంబంధిత శాఖ అధికారి ప్రతిపాదనను జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయమలో నమోదు చేసుకోగలరు. తేదీ 23-08-2022 వ తేదిన జిల్లా స్థాయి ఎంపికలు జరుగును.మెదక్ నందు ఉదయం గం. 11.00 లకు హాజరుకగమరియు జిల్లా స్థాయి లో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జరుగు పోటిలకు అర్హులు. కావున ఆసక్తి కలిగిన క్రీడాకారులు తేది:23.08.2022 న జిల్లా స్థాయి ఎంపికలకు గాను జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయము, మెదక్ నందు ఉదయం గం. 11.00 లకు హాజరుకగలరు. అని తెల్పడమైనది. ఇతర వివరాలకు 9347344440, 9493594388 లకు సంప్రదించగలరు

## కుక్కను హింసిస్తున్న యజమాని.. ఎంపీ వరకు వెళ్లడంతో.. కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

హైదరాబాద్, ఆగష్టు 20: కుక్కపిల్లలను పెంచుకునే కుటుంబాలు వాటిని కూడా ఎంతో ప్రేమగా చూసుకుంటాయి. కానీ కొందరు మాత్రం సరిగా పట్టించుకోకుండా, ఆహారం పెట్టకుండా ఆ మూగజీవాలకు నరకం చూపిస్తుంటారు.

అలా చేస్తున్న ఒక వ్యక్తికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏకంగా బీజేపీ ఎంపీ, జంతు ప్రేమికురాలు మేనకా గాంధీ ద్వారా ఈ నిర్లక్ష్యపు యజమాని విషయం పోలీసులకు తెలిసింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖనిలోని దుర్గా నగర్ ఆర్కే గార్డెన్‌లో నివాసముంటున్న సాయి దీపక్ అనే వ్యక్తి ఇరవై రోజుల క్రితం ఒక ల్యాబ్ బ్రీడ్ కుక్కను తన స్నేహితుల వద్ద తీసుకొని పెంచుకుంటున్నాడు.

కానీ దాన్ని సరిగ్గా చూసుకో పోయేసరికి కుక్క మెయిన్ రోడ్డు మీదకు వచ్చింది. అదే సమయంలో అటుగా వస్తున్న ఒక వాహనం ఢీ కొట్టడంతో కుక్క కాలికి గాయం అయింది. కుక్క నడవలేని స్థితిలో ఉందని, సరిగ్గా తిండి పెట్టకుండా పదే పదే కొడుతూ దానిని యజమాని హింసిస్తున్నాడని అక్కడున్న స్థానికులు ఫోటోలు, వీడియోలు తీశారు. వీటిని మరో జంతు ప్రేమికురాలైన యాంకర్ రష్మీ గౌతమ్‌కు పంపించారు. వాటిని చూసిన ఆమె.. బీజేపీ ఎంపీ మేనక గాంధీకి వీటిని చేరవేశారు. ఈ వీడియోలు చూసిన మేనక గాంధీ.. కరీంనగర్ సిపి సత్యనారాయణకు సమాచారం అందించారు.

దీంతో సిపి సత్యనారాయణ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ సిఐ రమేష్ బాబు.. తమ బ్లూ కోట్స్ సిబ్బంది శ్రీకాంత్, ప్రవీణ్‌లను సాయి దీపక్ ఇంటికి పంపించారు. అక్కడ కుక్క దీన స్థితిలో ఉండటం గమనించిన సిబ్బంది..

సిఐ రమేష్ బాబుకు విషయం చెప్పారు. ఈ సమాచారాన్ని వెటర్నరీ డాక్టర్ రామ్ కిరణ్‌కు అందించిన సిఐ.. కుక్కకు చికిత్స అందించారు. అనంతర 'హాండ్స్ 2 సర్వ్' ఫౌండేషన్ యానిమల్ రెస్క్యూ ప్రెసిడెంట్ అరవింద్ స్వామికి కుక్కను అప్పగించారు. కుక్కను కొనుక్కున్న సాయి దీపక్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి, మళ్ళీ ఇలాంటివి జరగకుండా ఉండాలని హెచ్చరించారు.

## పాల్వంచ బ్రహ్మ కుమారీస్ మెడిటేషన్ సెంటర్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- సత్యయుగ మొదటి రాజ కుమారుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బ్రహ్మకుమారి పద్మజ
- ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ క్రిసోలైట్
- అలరించిన నృత్య కళాకారిణి అంతర్జాతీయ అవార్డు గ్రహీత రమాదేవి రామ్ చిన్నారుల నృత్యాలు



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 20 (నేటినిజం ప్రతినిధి) : కృష్ణ జన్మాష్టమి సందర్భంగా పాల్వంచ బ్రహ్మ కుమారీస్ మెడిటేషన్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రహ్మకుమారి పద్మజ మాట్లాడుతూ అందరికీ శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు శ్రీకృష్ణుని జన్మదినం గురించి రకరకాలుగా చెబుతుంటారు.

కొందరు రావి ఆకు పైన నోట్లో బ్రొటన వేలు వేసుకొని వచ్చాడని మరికొందరు జైలులో జన్మించాడు అని చెబుతుంటారు.

వాస్తవానికి శ్రీకృష్ణ జన్మదినం రహస్యం ఏమిటి అంటే కృష్ణుడు మర్యాద పురుషోత్తముడు, 16 కళల సంపూర్ణనుడు, సంపూర్ణ నిర్వికారి, సత్య యుగ ప్రథమ రాజ కుమారుడు గా జన్మించాడు

శ్రీకృష్ణుడు అంటే అందరిని ఆకర్షించే వాడుపవిత్రమైన జన్మ ధారి గుర్తుగా నెమలి పించాన్ని ధరిస్తాడు.

అంతే కాకుండా శ్రీకృష్ణుడిలో అనేక గొప్ప విశేషతలు ఉన్నాయి. అందుకే ప్రతి ఒక్కరూ క్రిష్ణుడు లాంటి అబ్బాయిని కోరుకుంటారు వారి పిల్లలను కృష్ణుడిగా అలంకరించుకొని ఆనందిస్తుంటారు. కృష్ణుడు వెన్నను దొంగలిస్తాడు అంటారు. అంటే అందరి మనసులను గెలుచుకోవడం అని అర్థం అని ఆమె తెలిపారు.

అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన క్రిసోలైట్, మాట్లాడుతూ బ్రహ్మకుమారి పద్మజ చాలా మంచి కార్యక్రమాలు చేస్తున్నారు అని ఇంతటి గొప్ప కార్యక్రమంలో నన్ను భాగస్వామ్యం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం నృత్య కళాకారిణి రమాదేవి రామ్ బృందం చిన్నారులు అద్భుతంగా అలరించి అందరి మనసులను ఆకట్టుకున్నారు.

నృత్యం చేసిన చిన్నారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

## ఆధునిక యంత్రాలు వెరైటీ పరికరాలు

హైదరాబాద్, ఆగష్టు 20: ఆధునిక సాంకేతిక ఆధారంగా ఆవిష్కరించిన యంత్ర పరికరాలు, మెషిన్ టూల్స్ మాదాపూర్‌లోని హైటెక్స్ వేదికగా కొలువుదీరాయి. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్ ఇంటర్నేషనల్ మెషిన్ టూల్స్, ఇంజినీరింగ్ ఎక్స్ పో (హింటెక్స్), ఇండియా ప్రాసెస్ ఎక్స్ పో, కాన్ఫిరెన్స్ (ఐపీఈసీ) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హింటెక్స్ 6వ ఎడిషన్ ఎక్స్ పోను గురువారం ఐటి ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ అసిస్టెంట్ డైరెక్టర్ కె. శివరామప్రసాద్, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయదేవ్‌తో కలిసి ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 143 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేసిన జనరేటర్లు, లేత్ మెషనరీలు, సీఎన్‌జీ కటింగ్ అండ్ మౌల్డింగ్ మెషనరీలు, బ్యాటరీలు, బాయిలర్లు, డ్రిల్లింగ్ మెషనరీలు, ఎనర్జీ మెషనరీ, హైడ్రాలిక్ మెషనరీలు, మెషనరీ టూల్స్‌లను ప్రదర్శించారు. విక్రయదారులు, కొనుగోలుదారులు ఒకే చోట మెషనరీలను సందర్శించి వాటి పనితీరును తెలుసుకోవచ్చు. ఇందులో బీహెచ్ఈఎల్, ఎస్‌కేఎం టెక్నాలజీస్, ఎంటీఏఆర్, టాటా అడ్వాన్డ్ సిస్టమ్స్, టాటా సికోర్స్కీ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లోని జీఎంటీ ఇంజినీరింగ్ ప్రై.లిమిటెడ్ వారు రెండు రకాల మెషనరీలను అందిస్తున్నారు. ఇందులో మొదటిది లేజర్ కటింగ్ మెషీన్, రెండోది ఎలక్ట్రో హైడ్రాలిక్ సీఎన్‌జి ప్రెస్ బ్రేక్ మెషనరీ. లేజర్ కటింగ్ మెషీన్‌తో ఏదైనా ఐరన్, మైల్డ్ స్టీల్, స్టెయిన్‌లెస్ స్టీల్, కాపర్‌లను కావలసిన డిజైన్‌లతో సైజులను చేసేందుకు వినియోగిస్తారు. దీనిని ఇంజినీర్ ప్లాన్ ప్రకారం సిస్టమ్‌లో ప్రోగ్రామింగ్ చేసి మెషిన్‌కు సరిపడా డిజైన్‌తో పాటు ఎంత ఎంఎంతో రంధ్రాలు కావాలో సైజులను సెట్ చేసినట్లయితే అందులోని కటింగ్ హెడ్స్ ఆధారంగా ఫ్రిసిటెక్, రే టూల్స్ సహాయంతో మనం ఎంచుకున్న డిజైన్‌లో షీట్‌లను కట్ చేసి పంపుతుంది. ఇందులో బీఎల్ సిరీస్, జీఎల్ ఎఫ్‌టీ సిరీస్, జీఎల్ సిరీస్‌లు సీఎన్‌జీ కటింగ్ మెషీన్ సిరీస్‌లు ఉంటాయి. రెండో రకం ఎలక్ట్రో హైడ్రాలిక్ సీఎన్‌జీ ప్రెస్ బ్రేక్ మెషనరీతో అనేక రకాలైన షీట్‌లను ఫార్మింగ్ చేసుకోవచ్చు. మెషనరీలో లేసర్ కటింగ్ మెషిన్‌తో ఏదైనా ఐరన్, మైల్డ్ స్టీల్, స్టెయిన్‌లెస్ స్టీల్, కాపర్‌లను ఎన్ని డిగ్రీల కోణంలో మలచాలి? ఎటు వైపు తిప్పాలో సిస్టమ్‌లో ప్రోగ్రామింగ్ చేసినట్లయితే కావలసిన విధంగా షీట్‌లను మలుచుతుంది.

వివిధ గేజ్‌లతో టూల్స్..

పుణేకు చెందిన ఏటిక్యూ మెట్రో కంపెనీలో కటింగ్ టూల్స్ ఇన్స్పెక్షన్ మెషిన్, ఆటో క్విక్ మెజర్‌మెంట్ మెషిన్, ప్రొఫైల్ ప్రొజెక్టర్, లేసర్ మార్కింగ్ మెషిన్, డిజిటల్ మ్యాగ్రిఫైర్, మెజరింగ్ మెషిన్స్ వంటి యంత్ర పరికరాల సహాయంతో అనేక డిజైన్లు, సైజులతో కూడిన కటింగ్ టూల్స్, మెడికల్ కేర్, గ్యాస్ కిట్, జువెలరీ ఐటెంలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్, ఏరో స్పేస్, ఆటోమోటివ్, స్టాంపింగ్, ప్లాస్టిక్ మౌల్డింగ్ అండ్ రబ్బర్‌లతో పాటు 3సి ప్రొడక్ట్‌లను తయారు చేస్తుంది. వీటిని కావలసిన డిజైన్‌లో కావలసిన సైజులో తయారు చేసేందుకు ముందుగా సిస్టమ్‌లో ప్రోగ్రామింగ్ చేసి ఉంచినట్లయితే వివిధ ఎంఎంలతో వీటికి కావలసిన టూల్స్‌లను తయారు చేస్తుంది.

ఆప్టికల్ మెసరింగ్ ప్రూవ్..

తార్నాకలోని ఎస్ఎల్ఎస్ ఇంజినీరింగ్ ప్రై. లిమిటెడ్ కంపెనీ వర్క్ పీస్‌లను కావలసిన డైమెన్షన్‌లో మెజర్ చేసి వాటి ద్వారా తయారైన టూల్స్‌ను మార్కెట్‌లో విక్రయిస్తుంది. మనం ఏదైనా జాబ్ (వర్క్ పీస్)లను కావలసిన కొలత, డైమెన్షన్‌తో చేయాలంటే మెషిన్ చేసినట్లుగా చేయలేం. పైగా వంకర్లు తిరుగుతూ షేప్ ఔట్ అవుతాయి. వర్క్ పీస్‌లను పక్కా డైమెన్షన్‌తో మెజర్ చేస్తూ టూల్‌ను అందించడానికి సీఎన్‌జీ మెషిన్ డయామీటర్, ఆప్టికల్ మెజరింగ్ ప్రూవ్ సహాయంతో మల్టీ గేజ్‌లను మెజర్‌మెంట్ చేస్తాయి. వీటి ద్వారా చిన్న టూల్స్ సైతం మనం సిస్టమ్‌లో చేసిన డిజైన్‌తో తయారు చేయడంలో ఉపయోగపడుతాయి.

ఎయిర్ ఫిల్టర్‌లను శుభ్రం చేసేందుకు..

హైదరాబాద్‌లోని జనటిక్స్ న్యూమాటిక్ కంపెనీ ఎయిర్ ఫిల్టర్ రెగులేటర్, న్యూమాటిక్ ఎయిర్ సిలిండర్స్‌తో పాటు డైరెక్షన్ కంట్రోల్ బాల్స్‌లను తయారు చేస్తుంది. న్యూమాటిక్ ఎయిర్ సిలిండర్ ఏదైనా యంత్ర పరికరాలు, బస్, లారీ, కార్ వంటి తయారీలలో దీన్ని వాడతారు. ఆలాంటి సమయంలో వాటిలో ఏదైనా పార్టికల్స్ చేరి సమస్య వచ్చినప్పుడు దీన్ని ద్వారా మెషినరీలో పేరుకుపోయిన పార్టికల్స్‌ను ఎయిర్ ఫిల్టర్ ద్వారా క్లీన్ చేసేందుకు ఉపయోగించి ఫ్యాబ్రికేటర్ ద్వారా సులువుగా బయటకు పంపివేసేందుకు ఉపయోగపడుతాయి. డైరెక్షన్ కంట్రోల్ బాల్స్ .. న్యూమాటిక్ సిలిండర్స్‌ను కంట్రోల్ చేయడానికి వాడతారు. వీటిని ఎక్కువగా ఫుడ్ ప్రాసెసింగ్, మెషిన్ మ్యానుఫ్యాక్చరింగ్, సిమెంట్ అప్లికేషన్‌లకు చెందిన కంపెనీలు వీటిని వాడుతుంటారు.

## స్వతంత్ర స్ఫూర్తి నేటి తరానికి తెలియాలి : మంత్రి దయాకర్‌రావు



వరంగల్, ఆగష్టు 20: ఆ నాటి మహనీయుల పోరాటం, త్యాగాల ఫలితమే మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని.. ఆ స్ఫూర్తిని నేటి తరాలకు తెలియజెప్పేందుకే ప్రభుత్వం వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

వేడుకల్లో భాగంగా శనివారం జనగామ జిల్లా కొడకండ్ల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ సీఎం కెసీఆర్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వజ్రోత్సవ వేడుకలు జరుగుతున్నాయన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయడం, మహనీయుల త్యాగాలను స్మరించుకునేలా 15 రోజులపాటు రోజుకో కార్యక్రమాన్ని నిర్వహించి స్వతంత్ర స్ఫూర్తి, దేశభక్తి, సమైక్యతా భావాన్ని ప్రతి ఒక్కరిలో కలిగేలా ఉత్సవాలను పట్టణాలు, పల్లెపల్లెగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అహింసా మార్గంలో ఆనాడు గాంధీజీ, నెహ్రూ, సర్దార్ వల్లభభాయి పటేల్ సాధించిన భారత స్వతంత్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో ముందు ముందుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి మంత్రి బహుమతులు ప్రదానం చేశారు.

## తిరుపతి-సికింద్రాబాద్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లు

తిరుమల, ఆగష్టు 20: తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని ఆరాటపడుతున్న భక్తులకు రైల్వే శాఖ తీపి కబురు అందించింది. సికింద్రాబాద్-తిరుపతి మార్గంలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక రైళ్లు ఈ నెల 21, 28, 22,29 తేదీల్లో అందుబాటులో ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

నంబర్ 07481 రైలు తిరుపతిలో రాత్రి 9.10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అటు ఈ నెల 22, 29 తేదీల్లో సికింద్రాబాద్-తిరుపతి మధ్య రెండు రైళ్లు నడుస్తాయి. నంబర్ 07482 రైలు సాయంత్రం 4.15 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి.. మరుసటి రోజు ఉదయం 5.20 గంటలకు తిరుపతి చేరుతుంది. ఈ రెండు రైళ్లు రేణిగుంట, కడప, ఎర్రగుంట, తాడిపత్రి, గుంతకల్లు, మంత్రాలయం, రాయచూర్, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట స్టేషన్లలో ఆగుతాయి.

మరోవైపు సికింద్రాబాద్ నుంచి రాకపోకలు సాగించే పలు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే పొడగించింది. సికింద్రాబాద్-మధురై మధ్య ప్రతి మంగళవారం నడిచే రైలు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 26 వరకు పొడిగించారు. మధురై-సికింద్రాబాద్ రైలును వచ్చే నెల 28 వరకు పొడిగించగా.. సికింద్రాబాద్-జైపూర్ మధ్య నడిచే రైలును సెప్టెంబర్ 30 వరకు, అలాగే జైపూర్-సికింద్రాబాద్ మధ్య రైలును అక్టోబర్ 2 వరకు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

## వసుంధర డైమండ్ జ్యువలరీ ఎగ్జిబిషన్



ఖమ్మం, ఆగష్టు 20: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం వైరా రోడ్డులో గల కావేరి హోటల్ నందు

వసుంధర డైమండ్ జ్యువలరీ ఎగ్జిబిషన్ కం సేల్ ను ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ రాంబ్రహ్మం, ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,25 వ వార్షికోత్సవం సందర్భంగాఖమ్మం నగరం నందు ఎగ్జిబిషన్ శనివారం ఏర్పాటు చేయడం జరిగింది.

గత 25 సంవత్సరాల అనుభవంతో ఖమ్మం ప్రజలకు సేవలందిస్తూ హైదరాబాద్ మరియు ఖమ్మం నగరంలో ని ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఖమ్మం కస్టమర్ల ఆశీర్వాదంతో గత కొన్ని సంవత్సరాల నుండి ఎగ్జిబిషన్ ను నిర్వహించడం జరుగుతుందని, గత సంవత్సరం నిర్వహించిన ఎగ్జిబిషన్‌ఎంతో విజయవంతం చేశారని నిర్వాహకులు తెలియజేశారని వారన్నారు.

ఈ ఎగ్జిబిషన్ కం సెల్లో డైమండ్, కుందన్ ఉ ఎంటిక్ గోల్డ్, డిజైన్ కలెక్షన్స్, పాచి జ్యువలరీ, ప్రత్యేకంగా ఆకర్షిస్తుందని వారు అన్నారు.

ఈ అవకాశం శనివారం ఆదివారాల వరకు ఉంటుంది. కనుక ఖమ్మం నగర ప్రజలు ఎగ్జిబిషన్ సందర్శించి, వినియోగించుకోగలరు.

ఈ కార్యక్రమంలో మేయర్, పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత, వసుంధర ఎండి జలంధర్, స్టోర్ మేనేజర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## భక్తులతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ.. ఆరుగురు దుర్మరణం



జైపూర్:, ఆగష్టు 20: రాజస్థాన్‌లోని (ఖీజీతీజీబబిష్త్రజీని) పాలి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పాలి జిల్లాలోని సుమీర్‌పూర్‌లో భక్తులతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓ లారీ ఢీకొట్టింది. దీంతో ఆరుగురు మృతిచెందారు. మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. బాధితులు జైసల్మేర్‌లోని రామ్‌దేవరా ఆలయాన్ని దర్శించుకుని తిరుగుపయాణమయ్యారని, ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ట్రాలీని ఓ లారీ ఢీకొట్టిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## మునుగోడులో టీఆర్ఎస్ విజయం ఖాయం.. టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా ప్రెసిడెంట్ గుర్రాల నాగరాజు



హైదరాబాద్, ఆగష్టు 20: మునుగోడులో టీఆర్ఎస్ విజయం ఖాయం అని టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా ప్రెసిడెంట్ గుర్రాల నాగరాజు అన్నారు. మునుగోడులో ఈరోజు జరిగిన ప్రజాదీవెన సభలో కేసీఆర్ మాట్లాడిన తీరు, తెలంగాణ ప్రజలకు కేసీఆర్ పరిపాలనలో జరిగిన అభివృద్ధి తెలుసునని ఆయన అన్నారు. అలాగే నల్గొండ జిల్లాకు వస్తే మునుగోడు నియోజకర్గం ప్రజలు ఒకనాడు ఫ్లోరైడ్ నీళ్ల వల్ల నడుములు వంగిపోయి.. ఏ విధంగా బాధపడ్డారో కేసీఆర్ కళ్లారా చూసారని, అందుకే ఈ జిల్లా జీవన్మరణ సమస్యగా మారిన ఫ్లోరైడ్ రక్కసిని పారదోలారని నాగరాజు తెలిపారు.

ఈ మునుగోడు ఉపఎన్నిక ఎందుకు వచ్చిందో ప్రజలు గమనిస్తున్నారన్న ఆయన.. "కేసీఆర్ చేసే అభివృద్ధి, సంక్షేమం చాలు మునుగోడులో టీఆర్ఎస్ గెలవడానికి, కేసీఆర్ అన్నట్టు కాంగ్రెస్ ఉన్నా లేకున్నా ఒకట్టే, బీజేపీ దేశానికే ఏమి చెయ్యట్లేదు, అధికారంలో లేని రాష్ట్రానికి ఏమన్నా చేస్తది అని నమ్మే స్థితిలో ప్రజలు లేరు, మునుగోడు ప్రజలు అన్ని గమనిస్తూ రాబోయే ఉప ఎన్నికలో టీఆర్ఎస్‌కి పట్టం కడుతారు" అని తెలియజేశారు. టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ తరపున ప్రచార వివరాలను కొద్దీ రోజులలో తెలియజేస్తామని చెప్పారు.

## రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలి.. జిల్లా కలెక్టర్ సంగీత

కరీంనగర్ , ఆగష్టు 20:కరీంనగర్ గోదావరిఖని రహదారికి ఇరువైపులా ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. కరీంనగర్ గోదావరిఖని రహదారి వెంబడి నాటిన మొక్కలను అప్పన్నపేట వద్ద కలెక్టర్ శనివారం పరిశీలించారు. పెద్దపల్లి జిల్లా ప్రారంభంనుంచి గోదావరిఖని వరకు రాష్ట్ర రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను కలెక్టర్ పరిశీలించి, వంగిపోయిన మొక్కల స్థానంలో నూతన మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు.రహదారి వెంబడి మీడియం పై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, నూతన మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికి సంబంధించిన పనులు రెండు రోజులుగా ముమ్మరంగా జరుగుతున్నాయని, ఆగష్టు 21న హరితహారం కార్యక్రమం కింద రహదారి వెంబడి పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నామని గ్రామీణ అభివృద్ధి అధికారి కలెక్టర్ కు నివేదించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, పెద్దపల్లి ఎంపిడిఓ రాజు, సంబంధిత అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

